జనం కోసం - మన అక్షరం

# అక్షర వెలుగు

www.aksharavelugu.com

తెలుగు దిన పత్రిక

శుక్రవారం
22.04.2022

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్
సంపుటి - 01, సంచిక-57
పేజీలు - 4 వెల రూ. 5

ఎడిటర్ : గోనుకొండ పృద్విరాజు

aksharavelugudaily@gmail.com
8985893382

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

## రెండురోజుల పర్యటనకు
# భారత్ చేరుకున్న బోరిస్

- అహ్మదాబాద్‌లో ప్రధానికి ఘనంగా స్వాగతం
- సబర్మతి ఆశ్రమ సందర్శన..గాంధీకి నివాళి
- సబర్మతి సందర్శన అదృష్టంగా పేర్కొన్న బ్రిటన్ ప్రధాని



**గాంధీనగర్, ఏప్రిల్ 21 (అక్షర వెలుగు):** రెండు రోజుల భారత పర్యటనలో భాగంగా అహ్మదాబాద్ చేరుకున్న బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్.. సబర్మతి ఆశ్రమాన్ని సందర్శించారు. మహాత్మా గాంధీ చిత్రపటానికి నివాళి అర్పించారు. మహాత్మాగాంధీ రచించిన గైడ్ టు లండన్ అనే పుస్తకాన్ని ఆశ్రమ నిర్వాహకులు బోరిస్ జాన్సన్‌కు అందదేశారు. అలాగే గాంధీ శిష్యురాలు మిరాబెన్ ఆత్మకథ 'ద స్పిరిట్స్ పిల్‌గ్రిమేజ్' పుస్తకాన్ని కూడా అందజేశారు. అసాధారణమైన వ్యక్తి ఆశ్రమానికి రావటం, ప్రపంచాన్ని మార్చడానికి సత్యం, అహింసలను ఎలా మూలసూత్రాలుగా మలుచుకున్నారో అర్థం చేసుకోవడం.. తాను గొప్ప అదృష్టంగా భావిస్తున్నట్లు బోరిస్ జాన్సన్ తన సందేశంలో పేర్కొన్నారు. బ్రిటన్ ప్రధాన మంత్రి బోరిస్ జాన్సన్ రెండు రోజుల భారత పర్యటన గురువారం సబర్మతి ఆశ్రమాన్ని సందర్శించడంతో ప్రారంభమైంది. ఈ అసాధారణ వ్యక్తి ఆశ్రమాన్ని సందర్శించడం తనకు దక్కిన అపురూపమైన గౌరవమని సందర్శకుల పుస్తకంలో ఆయన రాశారు. మేలుకోసం ప్రపంచాన్ని మార్చడానికి సత్యం, అహింస అనే సున్నితమైన సిద్దాంతాలను ఏ విధంగా మోహరించారో తెలుసుకోవడం తనకు లభించిన విశిష్ట అవకాశమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సబర్మతి ఆశ్రమంలో బోరిస్ జాన్సన్ చరఖాను తిప్పి, నూలు వడికారు. ఈ ఆశ్రమం విశేషాలను గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ శిష్యురాలు మీరాబెన్ (మెడలీన్ స్లేడ్) రాసిన 'ది 2



# సమాజహితాన్ని వీడకుండా పనిచేయాలి

- నాయకులు ఐదేళ్లు మాతరమే ఉంటారు
- మీరు మాత్రం రిటైర్ అయ్యే వరకు ఉంటారు
- సివిల్ సర్వెంట్లకు ఉద్బోధించిన ఉపరాష్ట్రపతి వెంకయ్య

**హైదరాబాద్, ఏప్రిల్ 21 (అక్షర వెలుగు):** భారతదేశాన్ని నాలుగు ప్రధాన సవాళ్లు వేధిస్తున్నాయని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. పేదరికం, ఆర్థిక సామాజిక అసమానతలు, నిరక్షరాస్యతతో భరతమాత తల్లడిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దేశాన్ని ముందుకు నడిపించాల్సిన బాధ్యత ముఖ్యంగా అధికారులదేనని ఉద్ఘాటించారు. ప్రజాప్రతినిధుల కంటే అధికారులకే ఎక్కువ బాధ్యత ఉండాలన్న వెంకయ్య.. వ్యవస్థ, ప్రజలకు వారు జవాబుదారీతనం వహించాల్సి ఉంటుందని 2

# నీళ్లు, నిధులు, నియామకాలు లక్ష్యం నీరుగారింది

సిఎం కెసిఆర్ తీరుపై మండిపడ్డ మధుయాష్కీ



**మహబూబాబాద్, ఏప్రిల్ 21 (అక్షర వెలుగు):** తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది నీళ్లు, నిధులు, నియామకాలు ప్రాతిపదికన అని కాంగ్రెస్ నేత మధుయాష్కి అన్నారు. ఈ లక్ష్యం నెరవేరకున్నా కేసిఆర్ మాత్రం తన లక్ష్యాలను నెరవేర్చుకుంటున్నారని అన్నారు. గురువారం జిల్లాలో పర్యటించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమం ముఖ్యంగా రైతు ప్రయోజనం కోసమే అని స్పష్టం చేశారు. ప్రాజెక్టుల పేరుతో కమిషన్లకు కక్కుర్తి పడి తెలంగాణ రైతాంగాన్ని మోసం చేస్తున్న నయవంచకుడు కేసీఆర్ అని మండిపడ్డారు. అంబేద్కర్ పేరు మీద ఉన్న అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును కాళేశ్వరం ప్రాజెక్టుగా పేరు మార్చిన ఘనుడు కేసీఆర్ అని ఆయన వ్యాఖ్యానించారు. బడుగు బలహీన వర్గానికి చెందిన మహిళా గవర్నర్ పట్ల వివక్ష చూపడం సిగ్గుచేటన్నారు. బ్రాహ్మణ రాష్ట్రపతి, గవర్నర్‌కు ఒంగి దణ్ణం పెట్టిన కేసీఆర్, దళిత బలహీన వర్గానికి చెందిన రాష్ట్రపతి, గవర్నర్‌కు గౌరవం ఇవ్వకపోవడం ఆయన కుల దురహంకారానికి నిదర్శనమని తెలిపారు. కల్వకుంట్ల కుటుంబ పాలనను అంతమొదించేందుకు ప్రజలు సిద్ధమయ్యారన్నారు. వరంగల్‌లో జరిగే సభను విజయవంతం చేయాలని మధుయాష్కి విజ్ఞప్తి చేశారు.

# తీవ్ర నష్టాల్లో హైదరాబాద్ మెట్రో

- కరోనాతో పూర్తిగా ఆర్థిక భారం
- మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 21 (అక్షర వెలుగు):** కరోనాతో హైదరాబాద్ మెట్రో రైల్ తీవ్రంగా నష్టపోయిందని మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... కరోనాకు ముందు రోజుకు 4 లక్షల మంది మెట్రోలో ప్రయాణించే వారని తెలిపారు. ప్రస్తుతం రోజుకు 2.7లక్షల మంది ప్రయాణికులు ప్రయాణం చేస్తున్నారన్నారు. 2

# వరంగల్ గడ్డపై తెలంగాణ ఆత్మగౌరవ పోరాటం

- ప్రజలంతా రాహుల్ సభను విజయవంతం చేయాలి
- అధికారులు సభను అంతరాయం కలిగిస్తే ఊరుకునేది లేదు
- మీడియా సమావేశంలో రేవంత్ రెడ్డి వెల్లడి



**వరంగల్, ఏప్రిల్ 21 (అక్షర వెలుగు):** వరంగల్ గడ్డపై తెలంగాణ ఆత్మగౌరవాన్ని చాటుతామని పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. వరంగల్ సభను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కెసిఆర్, టిఆర్ఎస్‌లు ఎప్పుడు ఇబ్బంది వచ్చినా వరంగల్ సభలు నిర్వహించేవారని అన్నారు. టిఆర్ఎస్ గతంలో నిర్వహించిన సభకన్నా అధికంగా జనం వచ్చేలా సభను నిర్వహించి తీరుతామన్నారు. పోలీసులు అధికారులుగా వ్యవహరించాలని అన్నారు. సభకు ఆటంకం కల్పించే చర్యలకు దూరంగా ఉండాలన్నారు. రానున్న 12 నెలల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, అప్పుడు మేము అవినీతి అక్రమాలకు పాల్పడ్డ వారిని కచ్చింతంగా చర్చలు తీసుకుంటామన్నారు. అతిగా వ్యవహరించే అధికారులకు మిత్తితో చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇది తెలంగాణ గర్జన అన్నారు. 2

# 111జీవో రద్దుతో జంట జలాశయాలకు ముప్ప

- రియల్ వ్యాపారులకుమేలు చేసేందుకే జివో రద్దు
- కెసిఆర్ తీరుపై మండిపడ్డ పిసిసి చీఫ్ రేవంత్
- జీవో రద్దుపై హైపవర్ కమిటీ నివేదిక బయటపెట్టాలన్న శ్రవణ్



**హైదరాబాద్, ఏప్రిల్ 21 (అక్షర వెలుగు):** చారిత్రక జంట జలాశయాలను కాపాడాల్సిన ప్రభుత్వమే దానిని ఉనికికి ప్రమాదకారిగా మారిందని టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి అన్నారు. మోసగాడి మరో మోసం 3

# టెన్త్ ఇంటర్ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

ముందస్తు ఏర్పాట్లపై అధికారుల సమీక్ష



**మెదక్, ఏప్రిల్ 21 (అక్షర వెలుగు):** జిల్లాలో ఇంటర్ ఎగ్జామ్స్ కోసం 31 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 13,647 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ప్రథమ సంవత్సరంలో 7,259 మంది, ద్వితీయ సంవత్సరంలో 6,388 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇక సంగారెడ్డి జిల్లాలో ఫస్ట్‌ఇయర్ 17,124 మంది, సెకండ్ ఇయర్‌లో 15,390 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మెదక్ జిల్లాలో 11,534 మంది, సంగారెడ్డి జిల్లాలో రెగ్యులర్ 2

# పెరుగుతున్న కరోనా కేసులతో ప్రభుత్వం అప్రమత్తం

- కరోనా కట్టడికి జాగ్రత్తలే ముఖ్యం అన్న హెల్త్ డైరెక్టర్
- మాస్కులు ధరించడం, భౌతిక దూరం పాటించడం ముఖ్యమని వెల్లడి
- తెలంగాణలో ఫోర్త్ వేవ్ రాదని భరోసా 2

# బస్టాండ్‌లో మెడికల్ షాపులు

కాచిగూడలో ప్రారంభించిన బాజిరెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 21 (అక్షర వెలుగు):** కాచిగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో మెడికల్ షాపును టీఎస్ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎండీ వీసీ సజ్జనార్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. ఆర్టీసీ ఆదాయం పెంచే చర్యలు చేపట్టామని తెలిపారు. సొంత భవనాల 4

# నగరానికి నలువైపులా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు

- ఆస్పత్రుల నిర్మాణానికి రూ. 2,679 కోట్లు కేటాయింపు

**హైదరాబాద్, ఏప్రిల్ 21 (అక్షర వెలుగు):** తెలంగాణ వ్యాప్తంగా వైద్య సౌకర్యాలను మెరుగుపరిచేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అధునాతన సదుపాయాలు కల్పిస్తున్న కేసీఆర్.. హైదరాబాద్ నగరానికి నలువైపులా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణానికి నిర్ణయం తీసుకున్న విషయం విదితమే. తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఈ మూడు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను నిర్మించనున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా ఎల్బీనగర్, అల్వాల్, సనత్‌నగర్‌లలో నిర్మించే ఆస్పత్రుల నిర్మాణానికి రూ. 2,679 కోట్లు కేటాయిస్తూ.. వైద్యారోగ్య శాఖ పరిపాలనపరమైన ఉత్తర్వులను గురువారం జారీ చేసింది. ఇప్పటికే గచ్చిబౌలిలో తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ పేరుతో ఆస్పత్రిని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. రూ. 900 కోట్లతో ఎల్బీనగర్‌లో, రూ. 882 కోట్లతో సనత్‌నగర్‌లో, రూ. 897 కోట్లతో అల్వాల్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను నిర్మించేందుకు నిధులు కేటాయిస్తున్నట్లు జీవో ఎంఎస్ 41లో పేర్కొన్నది. ఆస్పత్రుల నిర్మాణం కోసం టెండర్లు పిలవాలని ఆర్ అండ్ బీ శాఖను ఆదేశించింది. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని టీఎస్ఎంఎస్ఐడీసీని, డీఎంఈలకు వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆస్పత్రులకు స్వయంప్రతిపత్తి హోదా కల్పిస్తున్నట్లు ఉత్తర్వుల్లో 4

## కౌన్సిలర్ రవినాయక్
# దారుణహత్య

విచక్షణారహితంగా గొడ్డళ్లతో నరికివేత



**మహబూబాబాద్, ఏప్రిల్ 21 (అక్షర వెలుగు):** జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. మహబూబాబాద్ 8వ వార్డు కౌన్సిలర్ బానోత్ రవినాయక్ దారుణ హత్యకు గురయ్యారు. గురువారం ఉదయం 11 గంటల సమయంలో మహబూబాబాద్ పట్టణంలోని పత్తిపాక ప్రాంతంలో ఈ సంఘటన జరిగింది. పత్తిపాకలో నూతనంగా నిర్మించుకుంటున్న ఇంటి పనులను పరిశీలించేందుకు వెళ్లిన రవినాయక్‌పై కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు గొడ్డళ్లతో విచక్షణా రహితంగా దాడి చేశారు. మెడ భాగంలో దాడి జరగడంతో రవి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో రవిని చికిత్స నిమిత్తం స్థానికులు ఏరియా హాస్పిటల్‌కి తరలించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రవినాయక్ హాస్పిటల్ తీసుకొచ్చిన తర్వాత ప్రాణాలు కోల్పోయినట్లుగా వైద్యులు నిర్ధారించారు. రవినాయక్ మృతదేహాన్ని ప్రస్తుతం పోస్టుమార్టంకు 2

# హైదరాబాద్‌లో హైటెక్ సెక్స్ రాకెట్

ఉగాండా వాసుల గుట్టు రట్టు చేసిన పోలీసులు ● ప్రత్యేక యాప్ ద్వారా వ్యభిచారం నిర్వహణ



**హైదరాబాద్, ఏప్రిల్ 21 (అక్షర వెలుగు):** వరంగల్ నగరంలో కొత్తరకం సెక్స్‌రాకెట్ గుట్టురట్టయింది. హైటెక్ రీతిలో సెక్స్ రాకెట్‌ను నడుపుతున్న ఉగాండా దేశీయులను హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. సెక్స్‌రాకెట్ కోసం ప్రత్యేక యాప్‌ను రూపొందించినట్లు గుర్తించారు. ఇందులో ఉగాండా దేశీయులతో పాటు అందరూ వీఐపీలే ఉన్నట్లు సమాచారం. బ్యాంక్ యాప్‌లో సెక్యూరిటీ మాదిరిగా సెక్స్ రాకెట్ కోసం ఉగాండా దేశీయులు ప్రత్యేక సెక్యూరిటీని ఏర్పాటు చేశారు. ఫ్లాట్‌కు వచ్చే విటులు తప్పనిసరిగా ప్రత్యేక కోడ్ వాడితేనే ఎంట్రీ ఉంటుంది. సీక్రెట్ కోడ్‌ను ఎంటర్ చేస్తేనే విటులను కలిసేందుకు నిర్వాహకులను అనుమతిస్తారు. నగరంలో ఇలాంటి హైటెక్ రీతిలో సెక్స్ రాకెట్ బయటపడటంతో పోలీసులు సైతం షాక్‌కు గురయ్యారు. టెక్నాలజీ ఆధారంగా సెక్స్ రాకెట్ నడుపుతున్న ఉగాండా దేశానికి చెందినవారిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సెక్స్ రాకెట్ విషయాలను తెలుసుకొని పోలీసులు విస్తుపోయారు..! సాధారణంగా సీక్రెట్ కోడ్‌లను డేటా ట్రాన్స్‌ఫర్, డేటా షేరింగ్, ఈమెయిల్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ లాగిన్ చేయడానికి వినియోగిస్తున్నారు. కానీ ఈవిధంగా సెక్స్ రాకెట్‌కు ఉపయోగించడం ఇదే తొలిసారి అని పోలీసులు చెబుతున్నారు. ఉగాండా దేశీయులు సెక్స్ రాకెట్ నిర్వహణకు ప్రత్యేక సెక్యూరిటీని ఏర్పాటు చేశారు. సీక్రెట్ కోడ్ ఎంటర్ చేస్తేనే ఎవరినైనా లోపలికి అనుమతిచ్చే విధంగా ఏర్పాట్లు చేసుకున్నారు. పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు కస్టమర్ ఆథెంటికేషన్ కోసం సీక్రెట్ కోడ్‌లు ఉపయోగించడం ఇదే తొలిసారిగా పోలీసులు గుర్తించారు. పోలీసులకు అందిన సమాచారం ఆధారంగా... నార్సింగిలోని ఓ ఫ్లాట్‌పై ఆకస్మిక దాడి చేశారు. అక్కడ నలుగురు ఉగాండా దేశానికి చెందినవారిని పోలీసులు గుర్తించారు. వారిలో ముగ్గురు సెక్స్ వర్కర్లు ఉన్నారు. వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా.. ఒక డేటింగ్ యాప్ ద్వారా కస్టమర్, నిర్వాహకులు సంప్రదింపులు జరిపినట్టుగా తెలుసుకుని పోలీసులు ఆశ్చర్యపోయారు. కస్టమర్ డబ్బులు చెల్లించడానికి ఒప్పుకున్న తర్వాత.. ఒక ఫ్లాట్‌లోని మహిళ వద్దకు వెళ్లేందుకు నిర్వాహకులు కోడ్‌ను షేర్ చేస్తారు. కస్టమర్ అక్కడికి వెళ్లి సీక్రెట్ కోడ్‌ను ఎంటర్ చేస్తేనే మహిళ వద్దకు వెళ్లేందుకు సదరు వ్యక్తికి అనుమతి ఉంటుంది. ఆ తర్వాత నిర్వాహకులు కస్టమర్ మొబైల్ ఫోన్ నుంచి వారి సంప్రదింపు వివరాలు, ఇతర సమాచారాన్ని తొలగిస్తారు. తద్వారా కస్టమర్ ఆ డేటాను దుర్వినియోగం చేయడం వీలు లేకుండా పోలీసులకు సాక్ష్యాలు దొరకకుండా ఉండేలా జాగ్రత్తపడతారు. వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్న ఉగాండా మహిళతోపాటు కస్టమర్‌ను కూడా నిందితులుగా చేర్చినట్టుగా పోలీసులు తెలిపారు. కస్టమర్లకు వల వేస్తున్న ఉగాండాకు చెందిన మరో వ్యక్తి పరారయ్యాడు. అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సంపాదకీయం

# వ్యవసాయాధారిత పరిశ్రమలకు దక్కని ప్రోత్సాహం

రైతులను ఓటు బ్యాంకుగా చూడడం అలవాటు చేసుకున్న పాలకులు వారిని దేశంలో ఆర్థికరంగంలో కీలకమైన వ్యక్తులుగా చూడడం లేదు. నిజానికి కంపెనీలకు మించిన ఆదాయాన్ని, ఉద్యోగ కల్పనను వ్యవసాయరంగమే కల్పిస్తోంది. వ్యవసాయానికి పెద్దపీట వేసివుంటే ఈ రంగం దేశ ఆర్థిక పురోగతిలో కీలకం కానుంది. బహుళజాతి కంపెనీలకూ ఎర్రతివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు. కార్పోరేట్ కంపెనీల యాజమాన్యాలతో రాసుకు పూసుకు తిరుగుతున్న ప్రభుత్వాధినేతలు అందులో పైసవంతు విలువ రైతులు ఇవ్వడం లేదు. నిజానికి దేశానికినమే గాకుండా ఆర్థిక చోదక శక్తిగా రైతులు ఉంటున్నారు. అన్నదాతలు వ్యవసాయం బంద్ చేస్తే కార్పోరేట్ కంపెనీలు కూడా మూతపడాల్సిందే. అలాటి అన్నదాతల విషయంలో ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉండడంతో మనదేశంలో తిండి గింజలను ఖరీదు పెట్టి కొనుక్కుంటు న్నాం. అలాగే వారికి అప్పులు మిగులుతున్నాయి. ఆస్తులు కరుగుతున్నాయి. కార్పోరేట్లు చేస్తున్న దేమిటో.. వీరు చేయలేనిదేమిటో ప్రభుత్వాలు గుర్తించాలి. స్వాతంత్ర్యం లభించి ఏడు దశాబ్దాలు పూర్తయినా ఈ ఆధునిక ఆర్థిక వ్యవస్థలో రైతుల సమస్యలు మరింత జఠిలం అవుతున్నాయే తప్ప పరిష్కారం కావడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన వ్యవసాయిక విధానం లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారిపోయింది. ఫ్రీ మార్కెట్ అనేది ఒక అభూత కల్పన మాత్రమే అయ్యింది. వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతన్నా రైతుల ఆర్థిక వ్యవస్థ మాత్రం బాగుపడడం లేదు. అవసరం లేకున్నా ఇబ్బడిముబ్బడిగా ఆహారధాన్యాలను దిగుమతి చేసు కోవడం కూడా రైతులకు శాపంగా మారింది. కల్తీలు కూడా రైతును కాటేస్తున్నాయి. మన అసవరాలకు సరిపడా కందులు, మిరప, ఇతర పంటలను రైతులు చెమటోడ్చి పండించినా వాటిని కొనుగోలు చేయడం లేదు. ఇతర దేశాల నుంచి ఆహార ధాన్యాల దిగుబడి తక్షణం ఆగిపోవాలని అన్నారు. అప్పుడు మన అసవరాలకు అనగుణంగా పంటల విధానం వస్తుందని అన్నారు. పంటల విధానంలో మార్పులు రావాలని కోరుకుంటున్నారు. వ్యవసాయరంగాన్ని ప్రోత్సహించి, అనుబంధ రంగగాలను అభివృద్ధి చేస్తే దేశానికి, ప్రపంచానికి అన్నం పెట్టే స్థోమత మన అన్నదాతలకు ఉంది. అనేక ఛోటామోటా కంపెనీలకు ఇస్తున్న రాయితీల మాదిరి వ్యవసాయానికి కూడా రాయితీలు ఇచ్చి పంటల ఉత్పత్తిని సవాల్‌గా తీసుకోవాలి.. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టి యువతను ప్రోత్సహించడం ద్వారా నిరుద్యోగ సమస్యకు, పంటల కొనుగోళ్లకు చెక్ పెట్టవచ్చు. కానీ అలా జరగడం లేదు. సస్య విప్లవానికి నాంది పలికేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలకు పూనుకో వాల్సిన తరుణంలో వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారు. దేశీయంగా వ్యవసాయ పురోభివృద్ధికి పాటుపడడం లేదని వ్యవసాయరంగ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. అలా చేయడం వల్ల వ్యవసాయం రంగం అతిపెద్ద ఉత్పాదక రంగంగా మారగలదని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెంచితే మంచిదని అంటున్నారు. అయితే ధాన్యం కొనుగోళ్ల వ్యవహారన్ని పక్కన పెట్టిన టిఆర్ఎస్ ఎందుకు దీనిపై రాజకీయం చేస్తోందన్నది ముఖ్యం. ఇప్పుడు తెలంగాణలో ప్రధానంగా చేయాల్సింది ధాన్యం కొనుగోళ్లు మాత్రమే. బియ్యం సేకరణకు ఎలాంటి ఇబ్బంది లేదని కేంద్రం పార్లమెంట్ వేదికగా ప్రకటించింది. కేంద్రమంత్రులు, బిజెపి నేతలు ప్రకటించారు. అయినా టిఆర్ఎస్ రాజకీయం చేయడం వెనక వేరే కోణం ఉందనే అనుకోవాలి. ఇది ధాన్యం కోసం కేంద్రంపై పోరాటం కాదన్నది అందరికీ అర్థం అవుతోంది. ఇకపోతే నీటి సౌకర్యం కల్పించి, 24 గంటల విద్యుత్ ఇస్తూ..రైతుబంధు ద్వారా ఆదుకుంటున్నామని చెబుతున్న సిఎం కెసిఆర్ యాసంగిలో కిలో ధాన్యం కూడా కొనమని ప్రకటించారు. అయితే కేంద్రకరం తన వాదనకు కట్టుబడి ఉండడంతో ఇప్పుడు ధాన్యం కొనుగోళ్లకు ముందుకు వచ్చారు. ధాన్యం విషయంలో అవసరమైతే రైతులను చైతన్యం చేయాలి. కానీ అందుకు భిన్నంగా రాజకీయ చేయడం వల్ల నష్టపోయేది టిఆర్ఎస్ మాత్రమే అని గ్రహించాలి. పోటాపోటీ ధర్నాలు,ర్యాలీలు, విమర్శలతో రాజకీయ లబ్ది పొందగలమేమో కానీ రైతుల సమస్యలను మాత్రం పరిష్కారం కావు. నిజానికి ధాన్యం కొనుగోలు అన్నది ఒక పంటకు ముందే నిర్ణయించాలి. ఏ పంట వేయాలో ముందే చెప్పాలి. కానీ అదేమీ చేయకుండా రాష్ట్రప్రభుత్వం మీద బిజెపి..కేంద్రంపై టిఆర్ఎస్ యుద్ధం చేయడం ఎంతవరకు సబబు.ఇది ప్రభుత్వం.. పార్టీల మధ్య పోరాటం కాదని గుర్తించడం లేదు. ఇది ప్రభుత్వాల మధ్య యుద్ధం మాత్రమే కాగలదు. రైతు పండించిన పంట కల్లాలు, మార్కెట్ యార్డ్‌లు, చివరకు రోడ్లపై కూడా ఎక్కడపడితే అక్కడ దర్శనమిస్తుంది.. కానీ, గిట్టుబాటు ధర చెల్లించి రైతు నుంచి పంటను కొనుగోలు చేయాల్సిన ప్రభుత్వాలు పరస్పరం దుమ్మెత్తి పోసుకుంటున్న తీరు దారుణం కాక మరోటి కాదు. తాజా రాజకీయం మొత్తం వడ్ల చుట్టే తిరుగుతోంది. వడ్ల పండించాలని ఒకరు, పండించవద్దని మరొకరు.. ఇలా రైతులను గందరగోళంలోకి నెట్టేస్తున్నారు..

**పృథ్విరాజ్ గోసుకొండ**
ఎడిటర్

# బిజెపిని అడ్డుకోవడమే లక్ష్యమా ?

**టిఆర్ఎస్ పోరుబాట వెనక కారణలు ఇవేనా**
**తృతీయ ఫ్రంట్ వైపు మళ్లీ కెసిఆర్ అడుగులు పడేనా**
**రాజకీయ విమర్శల్లో హుందాతనం కూడా ముఖ్యమే**

**హైదరాబాద్, ఏప్రిల్ 21 (అక్షర వెలుగు):** రాష్ట్రంలో బిజెపి ఎదుగుదల టిఆర్ఎస్‌ను భయపెడుతోందా... హుజూరాబాద్ ఉపఎన్నికల ఫలితం తరవాత టిఆర్ఎస్ రూటు మార్చడానికి కారణం ఏమిటి అన్నది ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. రాజకీయంగగా బిజెపిని ఎదుర్కొనే క్రమంలో మంత్రులు మాట్లాడుతున్న భాష మారుతోంది. విమర్శలకు పదను పెట్టడంలో తప్పు లేదు కానీ వాడు..వీడు అంటూ సంబోధిస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. బిజెపికి వ్యతిరేకంగా తీసుకున్న టర్న్ కారణంగా రాజకీయ కోణం ఉండొచ్చు. కానీ సరైన భాష వాడకుండా చేస్తున్న విమర్శలతో ముందుగా నష్టపోయేది టిఆర్ఎస్ మాత్రమే అని ఆ పార్టీ అధినేత గుర్తించడం లేదు. మంత్రి కెటిఆర్ కూడా వాడూవీడూ అంటూ సంబోధించడం సరికాదు. తమ వ్యక్తిగత రాజకీయంలో రైతులను అనవసరంగా లాగి ధాన్యం కొనబోమని చెప్పారు. ఈ యాసంగిలో కిలో ధాన్యం కూడా కొనబోమని చెప్పడం ద్వారా రైతుల్లో అనవసర వ్యతిరేకతలను టిఆర్ఎస్ మూటగట్టుకుంది. తీరా కేంద్రం కూడా మొండి కేయడంతో ఇప్పుడు కొనుగోళ్లకు ఆదేశించింది. కేంద్రంపై పోరాటం చేయడానికి సమస్యలు వేరుగా ఉండాలి. ధాన్యం సమస్యతో యుద్ధం చేయడం వల్ల లాభం కన్నా నష్టమే ఎక్కువ. నిజానికి ఇంతకాలం టిఆర్ఎస్ పార్టీ ఓ రకంగా బిజెపికి అంటకాగింది. ప్రధాని మోడీ తీసుకున్న అనేక నిర్ణయాలకు తలూపింది. మోడీ ప్రభుత్వం తెచ్చిన సాగు చట్టాలపై కూడా టీఆర్ఎస్ మొదట తటస్థ వైఖరిని అనుసరించింది. రైతు ఆందోళనలకు మద్దతు ఇవ్వలేదు. చట్టాలకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం కూడా చేయలేదు. కాబట్టి కేంద్రంతో టీఆర్ఎస్ విధానం లోపాయకారిగా అనుకూలం గా నడిచిందన్న ఆరోపణల వచ్చాయి. మోడీ కనుసన్నల్లో కేసీఆర్ నడుస్తున్నారనే భావన కలిగించింది. ఈ ఏడేళ్లలో ఈ భావన బలపడింది. ఐతే, హుజురాబాద్ ఉప ఎన్నికల ఓటమి తరువాత బీజేపీ పట్ల టీఆర్ఎస్ తప్పనిసరి పరిస్థితిలో తన విధానం మార్చుకోవాల్సి వచ్చింది. తెలంగాణ తాజా రాజకీయ పరిణామాలు దానిని సూచిస్తున్నాయి. భారతీయ జనతా పార్టీ వర్గాలలో ఫ్రెండ్లీ పార్టీగా పేరున్న తెలంగాణ రాష్ట్ర సమితి చివరకు ఎదరుదాడికి దిగే పరిస్థితి తెచ్చుకోవడం వెనక బిజెపి బలపడకుండా చూడాలన్న లక్ష్యం తప్ప మరోటి కాదు. తెలంగాణలో పెరుగుతున్న బీజేపీ బలానికి నిదర్శనంగా విశ్లేషకులు ఈ పరిణామాలను చూస్తున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికలలో నాలుగు లోక్‌సభ స్థానాలను గెలుచుకోవడం ద్వారా బిజెపి పుంజుకుంది. నిజామాబాద్‌లో బీజేపీ అభ్యర్థి చేతిలో కేసీఆర్ కూతురు కవిత ఓటమి పాలైంది. దాంతో టీఆర్ఎస్ అప్రమత్తమైంది. ఆ తర్వాత దుబ్బాక ఉప ఎన్నిక, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ ప్రదర్శన టీఆర్ఎస్‌లో గుబులు రేపింది. ఇటీవల హుజూరాబాద్ ఉప ఎన్నికలో టీఆర్ఎస్ ఓటమి కేసీఆర్ కు పెద్ద షాక్ అని చెప్పాలి. తెలంగాణలో బీజేపీ ఎదుగుదల కేసీఆర్ ఆందోళనకు కారణం కావచ్చు. ఎన్‌డీఏ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అంశాల ప్రాతిపదికన పోరాడేందుకు టీఆర్ఎస్ ఇతర ప్రతిపక్ష పార్టీలతో చేతులు కలిపింది. బీజేపీ పట్ల టీఆర్ఎస్ మొన్నటి వరకు తటస్థ వైఖరిని అనుసరించింది. చాలా సందర్భాలలో కేంద్ర ప్రభుత్వ విధానాలను సమర్ధించింది. బిల్లులకు మద్దతిచ్చింది. లేదంటే వ్యూహాత్మక మౌనాన్ని ఆశ్రయించిందే తప్ప ఏనాడూ వ్యతిరేకత ప్రదర్శించలేదు. మోడీ సర్కార్‌ని విమర్శించటం పెద్దగా చేయలేదు. ఎన్నికల వేళ మాత్రమే పరస్పర విమర్శలకు పదను పెట్టాయి. ఎన్నికల తరువాత మళ్లీ షరా మామూలే అన్నట్లుగా ఇంతకాలం చెట్టపట్టాలు వేసుకుని తిరిగారు. ఇకపోతే మారిన రాజకీయాల నేపథ్యంలో ఇప్పుడు వివాదాస్పద సాగు చట్టాలు, లఖింపూర్ ఖేరీ దుర్ఘటన, విద్యుత్ సంస్కరణలు, పెరుగుతున్న ఇంధన ధరలు, చైనా దురాక్రమణతో పాటు ఇంకా అనేక అంశాలలో మోడీ ప్రభుత్వంపై కేసీఆర్ విరుచుకుపడుతున్నారు. పార్టీ ఇప్పటి వరకు అనుసరిస్తున్న తటస్థ వైఖరిని వదిలి పెట్టాలని పార్లమెంటరీ పార్టీ సమావేశంలో చెప్పారు. ఎంపీలకు దీనిపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. వీరు ఇతర ప్రతిపక్ష పార్టీల సమన్వయంతో కేంద్రానికి వ్యతిరేకంగా తమ దాడిని తీవ్రం చేసారు. ఈ పార్లమెంట్ సమావేశాలను బహిష్కరించారు. నిజానికి, బీజేపీని టార్గెట్ చేస్తూ టీఆర్ఎస్ వ్యూహాత్మకంగా వరి కొనుగోలు అంశాన్ని తెరమీదకు తెచ్చింది. కాబట్టి దీనిని కేంద్రం వర్సెస్ టీఆర్ఎస్‌లా కాకుండా బీజేపీ మీద టీఆర్ఎస్ యుద్ధంగా చూస్తే బాగుంటుంది. ధాన్యం కొనుగోలు అంశంపై కొద్ది రోజులుగా బీజేపీని, కేంద్రాన్ని కేసీఆర్ దునుమాడుతున్నారు. రైతుల ధర్నాలు.. నిరసన కార్యక్రమాలు చేపట్టింది. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఆ పార్టీ ఎంపీలు దీనిపై గట్టిగానే పోరాడారు. ఈ పరిణామాలను బీజేపీ మరోలా తీసుకుంటోంది. 2023 ఎన్నికల్లో బీజేపీయే తన ప్రత్యర్థిగా కేసీఆర్ డిసైడ్ అయ్యారని ప్రచారం చేస్తోంది. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌తో టీఆర్ఎస్ పొత్తు పెట్టుకున్నా ఆశ్చర్యం లేదని కమలం పార్టీ నాయకులు అంటున్నారు. ఐతే, బీజేపీకి ధీటుగా టీఆర్ఎస్ ఎన్నికల ప్రచార నినాదాన్ని సృష్టించే దిశగా కేసీఆర్ పావులు కదుపుతున్నట్టు కనిపిస్తోంది. ఈ పరిణామాలు తృతీయ ఫ్రంట్‌కు దారితీస్తాయా లేదా అన్నది చూడాలి.

# పెరుగుతున్న కరోనా కేసులతో ప్రభుత్వం అప్రమత్తం



(మొదటి పేజీ తరువాయి) **హైదరాబాద్, ఏప్రిల్ 21 (అక్షర వెలుగు):** రాష్ట్రంలో కరోనా పూర్తిగా కంట్రోల్‌లోనే ఉంది.. కానీ పక్క రాష్ట్రాల్లో కేసులు పెరుగుతున్నందున ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించాల్సిందేనని రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ శ్రీనివాస్ రావు స్పష్టం చేశారు. దేశంలో కేసులు పెరుగుతున్న క్రమంలో ఆరోగ్యశ్రూఖ అప్రమత్తం అయ్యింది. మళ్లీ జాగ్రత్తలతపై ప్రజలను హెచ్చరించింది. మాస్కు ధరించకపోతే రూ. వెయ్యి జరిమానా విధిస్తామని చెప్పారు. మాస్కు ధరించి జాగ్రత్తలు పాటించడం ద్వారా కరోనాను అడ్డుకోగలమని అన్నారు. ఇతర రాష్ట్రాల్లో కరోనా పాజిటివ్ కేసులు పెరుగుతున్న క్రమంలో శ్రీనివాస్ రావు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ వ్యాప్తంగా ఈ రెండు నెలల్లో భారీ సంఖ్యలో పెళ్లిళ్లు ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ కరోనా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సీరో సర్వే ప్రకారం తెలంగాణలో ఫోర్త్ వేవ్ రాదని స్పష్టం చేశారు. అయినప్పటికీ ప్రతి వ్యక్తి మాస్కు ధరించడంతో పాటు, అర్హులైన వారు వ్యాక్సిన్ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల భాగస్వామ్యం తో కొవిడ్‌ను నియంత్రించగలిగాం. రాబోయే రోజుల్లో కూడా ప్రజల . ఢిల్లీ, హర్యానా, యూపీతో పాటు పక్క రాష్టాల్లో కేసులు పెరుగుతున్న దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి. ప్రతి ఒక్కరూ స్వీయ జాగ్రత్తలు పాటించాలి. పెళ్లిళ్లు, ఇతర ఫంక్షన్లు, ప్రయాణాలను చేసుకోవచ్చు.. కానీ మాస్కు ధరించాలి. వ్యాక్సిన్ తీసుకోవాలి. ఫోర్త్ వేవ్ నుంచి బయటపడాలంటే మాస్కు, వ్యాక్సిన్ తప్పనిసరి అని స్పష్టం చేశారు. కేంద్రం ఆదేశాల ప్రకారం.. 60 సంవత్సరాల పైబడిన వ్యక్తులందరికీ ప్రతి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో బూస్టర్ డోసు ఇస్తున్నామని తెలిపారు. రెండో టీకా తీసుకొని 9 నెలలు పూర్తయిన వారు మూడో డోసు తీసుకోవాలని సూచించారు. 12 నుంచి 17 ఏండ్ల వయసున్న పిల్లలు రెండో డోసు తీసుకోవాలి. 18-59 ఏండ్ల వయసు వారికి ఉచితంగా బూస్టర్ డోసు పంపిణీకి కేంద్రంతో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ సంప్రదింపులు జరుపుతుందని డీహెచ్ శ్రీనివాస్ రావు వెల్లడించారు. ప్రజల అజాగ్రత్తల కారణంగానే రాష్ట్రంలో మళ్లీ కరోనా కేసులు పెరుగుతున్నాయని శ్రీనివాస్ తెలిపారు. చైనా, తైవాన్, ఈజిప్టు వంటి దేశాలతో పాటు ఢిల్లీ, హర్యానా, యూపీలో కరోనా కేసులు పెరుగుతున్నాయని చెప్పారు.

## సమాజహితాన్ని వీడకుండా పనిచేయాలి

(మొదటి పేజీ తరువాయి) పేర్కొన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో జరిగిన నేషన్ సివిల్ సర్వీస్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెంకయ్య నాయుడు హాజరయ్యారు. ఆల్ ఇండియా సర్వీసెస్ ఆఫీసర్ ట్రైనీలను ఉద్దేశించి ప్రసంగించారు. నాయకుల కంటే అధికారులకే బాధ్యతలు ఎక్కువ ఉండాలన్నారు. ప్రజాప్రతినిధులకంటే అధికారులకే ప్రజాప్రతినిధులు ఐదేళ్లకోసారి మారుతారు కానీ.. కార్యనిర్వాహకవర్గం శాశ్వతమైందని అన్నారు. వ్యవస్థ, ప్రజలకు జవాబుదారీతనం వహించాల్సింది అధికారులేనని పేర్కొన్నారు. యువ సివిల్ సర్వెంట్లు వృత్తిపరమైన నైపుణ్యాలు పెంచుకుంటూ అవకాశాలు అందిపుచ్చుకోవాలి. సమాజంలో అట్టడుగున ఉన్న ప్రజల శ్రేయస్సు దృష్టిలో పెట్టుకుని పనిచేయాలి. ప్రజాస్వామ్య భారతదేశంలో కార్యనిర్వాహక వ్యవస్థ మూడో మూల స్థంభం. ప్రజలు, సమాజం, రాష్ట్రం, దేశం ప్రయోజనాల దృష్ట్యా సివిల్ సర్వెంట్లు సరైన మార్గంలో పనిచేయాలి. రాజకీయ పార్టీల నేతలు ఐదేళ్లకోసారి ప్రజల వద్దకు వెళ్ళి తీర్పు కోరతారు. అదే సివిల్ సర్వెంట్లు పదవీ విరమణ వరకు సుదీర్ఘకాలం వివిధ హోదాల్లో పనిచేయాల్సి ఉంటుంది. ప్రతి సివిల్ సర్వెంట్ నీతి, నిజాయితీ, నిర్భయంగా విధులు నిర్వహించాలి. దస్త్రాలపై సంతకాలు పెడుతూ సివిల్ సర్వెంట్లు కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఆ నిర్ణయం, ప్రతి దస్త్రం ఒక జీవితం, సమాజం, దేశం కావచ్చు... కాబట్టి జాగ్రత్తగా ఉండాలి. ప్రతి సివిల్ సర్వెంట్ నిర్భయంగా డైనమిక్ నిర్ణయాలు తీసుకోవాలి. రాజకీయ జోక్యం, నేతల ఒత్తిళ్ల పట్ల దూరంగా ఉండాలి. చట్టానికి లోబడి నిబద్ధతతో పనిచేయాలన్నారు. ఎంతో కష్టమైన పోటీని తట్టుకుని సివిల్ సర్వీసెస్‌కు ఎంపిక అవుతున్న యువత.. ఎట్టి పరిస్థితుల్లోనూ తాము నమ్మిన సిద్ధాంతాలను వదిలిపెట్టకూడదని సూచించారు. శరవేగంగా భారతదేశం అభివృద్ధి చెందుతున్నా లింగ వివక్ష కొనసాతుండటం దురదృష్టకరమని వాపోయారు. ప్రపంచవ్యాప్తంగా అనూహ్యంగా వాతావరణ మార్పులు కూడా ఓ సవాల్. ఆ సవాళ్లు తీవ్రంగా తీసుకుని అధిగమించేందుకు సివిల్ సర్వెంట్లు కృషి చేయాలి.

## వరంగల్ గడ్డపై తెలంగాణ ఆత్మగౌరవ పోరాటం

(మొదటి పేజీ తరువాయి) ఇంద్రవెల్లి సభలో 25 కిలోమీటర్ల దూరంలో ఆపి మోసం చేశారని అన్నారు. రానున్న 12 నెలల కాలంపాటు నిద్రపోయేది లేదని,కెసిఆర్‌ను నిద్రపోనీయమని కూడా రేవంత్ హెచ్చరించారు. సభను సజావుగా సాగేలా ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. తెలంగాణ బిడ్డలు ఇక్కడ ఆత్మగౌరవాన్ని చాటడానికి వస్తున్నారని అన్నారు. ఇప్పటికే 30 శాతం రైతులు తక్కువ ధరకు ధాన్యం అమ్ముకున్నారని చెప్పారు. ప్రభుత్వం మద్దతుధరతో ధాన్యం కొనాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే ధాన్యం అమ్ముకున్న రైతులకు పరిహారం చెల్లించాలన్నారు. రేవంత్‌రెడ్డిపై మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు సరికాదని పేర్కొన్నారు. కేటీఆర్ ఎక్కడ ఉద్యమం చేశారో చెప్పాలనికోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## రెండురోజుల పర్యటనకు భారత్ చేరుకున్న బోరిస్

(మొదటి పేజీ తరువాయి) స్పిరిట్స్ పిల్‌గ్రిమేజ్' పుస్తకాన్ని జాన్సన్‌కు బహూకరించారు. మహాత్మా గాంధీ రాసిన, ప్రచురింపబడని పుస్తకం 'గైడ్ టు లండన్'ను కూడా ఆయనకు బహూకరించారు. అంతకుముందు బోరిస్ జాన్సన్‌కు అహ్మదాబాద్ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ విమానాశ్రయం నుంచి ఆయన బస చేసే హోటల్ వరకు నాలుగు కిలోమీటర్ల పొడవునా రోడ్ షో, గుజరాతీ నృత్యాలతో స్వాగతం పలికారు. బోరిస్ జాన్సన్ పర్యటన కోవిడ్ మహమ్మారి కారణంగా గతంలో రద్దయింది. ప్రస్తుత భారత పర్యటనలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో ఆయన చర్చలు జరుపుతారు. మన దేశంలో బ్యాంకులను మోసగించి, లండన్‌లో ఉంటున్న విజయ్ మాల్యా, నీరవ్ మోదీలను భారత దేశానికి అప్పగించాలని ప్రధాని మోదీ కోరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. నీరవ్ మోదీ సౌత్-వెస్ట్ లండన్‌లోని వాండ్స్‌వర్త్ జైలులో ఉన్నారు. విజయ్ మాల్యా లండన్‌లో ఉన్నారు. బోరిస్ జాన్సన్ గురువారం గుజరాత్‌లో గడుపుతారు. సైన్స్, ఆరోగ్యం, టెక్నాలజీ రంగాల్లో ఇరు దేశాల మధ్య సహకారం, పెట్టుబడులను ఆయన ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఓ బ్రిటిష్ ప్రధాన మంత్రి గుజరాత్‌లో పర్యటిస్తుండటం ఇదే తొలిసారి. మరోవైపు బ్రిటిష్-ఇండియన్ జనాభాలో దాదాపు సగం మంది గుజరాతీ మూలాలుగలవారే. ఈ పర్యటన వల్ల బ్రిటన్ ఎన్నికల్లో ఆయన పార్టీకి ప్రయోజనం కలిగే అవకాశం ఉందని కూడా కొందరు చెప్తున్నారు. భారత పర్యటనకు బయల్దేరడానికి ముందు బోరిస్ జాన్సన్ పంపిన సంకేతాల ప్రకారం, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి బదులుగా మరిన్ని వీసాలను భారతీయులకు మంజూరు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రతిభావంతులు బ్రిటన్‌కు రావడానికి తాను ఎల్లప్పుడూ అనుకూలమేనని ఆయన చెప్పారు. బ్రిటన్ ఆర్థిక వ్యవస్థలో వందలు వేల మంది ప్రతిభావంతుల కొరత ఉందన్నారు. మనకు ప్రగతిశీల వైఖరి అవసరమని చెప్పారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం నేపథ్యంలో ఆయన కేవలం భారత దేశ వైఖరిని వింటారని, ఆయన ఉపన్యాసాన్ని ఇవ్వబోరని తెలుస్తోంది. ముఖ్యంగా నిర్బంధాలు లేని, స్వేచ్ఛాయుత ఇండో-పసిఫిక్, స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందాలపైనే దృష్టి పెడతారని సమాచారం. శుక్రవారం ఢిల్లీలో పర్యటించి ప్రధాని మోదీతో సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా ద్వైపాక్షిక, సైనిక, వాణిజ్య సంబంధాల గురించి ఇరు దేశాల నేతలు చర్చించనున్నారు. ఇండో-పసిఫిక్ రీజియన్‌పై కూడా వీరు చర్చించే అవకాశం ఉంది. కాగా బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి.

## టెన్త్ ఇంటర్ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి) 22,548, ప్రైవేట్ 11 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మెదక్ ఇంటర్ జిల్లా నోడల్ అధికారి సత్యనారాయణ అన్నారు.ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సన్నద్ధం కావాలి. స్జబెక్టుల వారీగా ముఖ్యమైన ప్రశ్నలు తయారు చేసుకుని ప్రాక్టీస్ చేయాలి. శ్రద్ధతో చదవడం. రాయడం చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. పదోతరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాం. పరీక్షలకు నెల రోజుల సమయం ఉంది. విద్యార్థులు సమయం వృథా చేయొద్దు. స్జబెక్టుల వారీగా సమయం కేటాయించి చదివితే ఉత్తమ ఫలితాలు ఉంటాయి. వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించి వారికి సంబంధిత టీచర్‌తో నివృత్తి చేస్తూ వారిని సిద్ధం చేస్తున్నాం. జిల్లాలో మే 23 నుంచి జూన్ 1 వరకు జరిగే పదోతరగతి పరీక్షలు ప్రశాంతవాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రమేశ్ అధికారులకు సూచించారు. కరోనా తర్వాత తొలిసారిగా జరిగే పరీక్షలకు ఆరు స్జబెక్టులు ఆరు పేపర్లు మాత్రమే ఉంటాయన్నారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష పేపర్లను భద్రపరిచేందుకు 16 స్ట్రాంగ్ రూంలను, పేపర్లను ఎప్పటికప్పుడు పోస్టుచేయడానికి 19 పోస్టాఫీసులను గుర్తించి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఒక్కో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందంలో విద్యాశాఖ, రెవెన్యూ, పోలీసుశాఖ నుంచి ఒక్కొక్కరు చొప్పున మూడు బృందాలు ఉంటాయన్నారు. ఉదయం 7:30 గంటల నుంచి బస్సులు ఆయా రూట్లలో నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు ఉంటుందని అదనపు ఎస్పీ బాలస్వామి తెలిపారు.

## హద్దుమీరి మాట్లాడుతున్న మంత్రి కెటిఆర్

**స్థాయిని మరచి విమర్శలు దారుణం • రాజ్యాంగం తెలియకుండా విమర్శలా**
**మండిపడ్డ బిజెపి మహిళానేత రావుపద్మ**

**హన్మకొండ, ఏప్రిల్ 21 (అక్షర వెలుగు):** మంత్రి కేటీఆర్ హద్దుమీరి మాట్లాడుతున్నారని, స్థాయిని మరచి విమర్శలు చేస్తున్నారని, విమర్శలు కూడా హుందాగా కాకుండా బజారు మనుషులు మాట్లాడుకునేలా చేయడం దారుణమని వరంగల్‌లో ఆయన చేసిన వ్యాఖ్యలను బీజేపీ మహిళా నేత రావు పద్మ తప్పుబట్టారు. గురువారం ఆమె ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ అనాలోచితంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆయన ఎక్కడ మాట్లాడినా బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయాలన్నారు. కేటీఆర్‌కు అసలు రాజ్యాంగం తెలుసా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో డ్రగ్స్, మద్యంపై ప్రభుత్వం తీసుకున్న చర్యలేవని నిలదీశారు. కోచ్ ఫ్యాక్టరీపై అసలు మంత్రికి అవగాహన ఉందా? అన్నారు. మోదీ, యోగి ఆస్తులెన్ని.. కేసీఆర్, కేటీఆర్ ఆస్తులెన్నో చర్చకు సిద్ధమా? అంటూ రావు పద్మ సవాల్ విసిరారు.మంత్రి కేటీఆర్ ఫ్రస్టేషన్‌లో అనాలోచితంగా మాట్లాడుతున్నారని రావు పద్మ అన్నారు. గురువారం కేటీఆర్ ఎక్కడ మాట్లాడినా బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయాలని డీజీపీని కోరుతున్నామన్నారు. కేటీఆర్ నీకు అసలు రాజ్యాంగం తెలుసా అని ప్రశ్నించారు. కేంద్రం 42శాతం పన్ను వాటా రాష్ట్రానికి కేటాయిస్తుందని... రాష్ట్ర పన్నులు తమరు ఎక్కడ ఖర్చు చేశారని నిలదీశారు. యువతను డ్రగ్స్, మద్యం మత్తులో ముంచుతున్నారని... వీటిపై తమరు తీసుకున్న చర్యలేవని అడిగారు. గతంలో ఫ్లెక్సీలు వద్దని చెప్పి, ఎక్కడ పడితే అక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం ఏంటని బీజేపీ నేత అన్నారు. కోచ్ ఫ్యాక్టరీపై కేటీఆర్‌కు అసలు అవగాహన ఉందా అని ప్రశ్నించారు. మీ అబద్దాలకు ప్రకృతి కూడా సహకరించకుండా మీటింగ్‌కు ముందే మీ టెంట్ కూలింది. అసలు తెలంగాణ రాకపోతే నీకు మంత్రి పదవి ఎక్కడిది....?.మా నాయకుడు బిసి కావడం వల్లే విమర్శలు చేస్తున్నారు. మోడీ,యోగి ఆస్తులెన్ని... మీ ఆస్తులెన్నో చర్చకు సిద్ధమా...?. 300 కోట్ల అభివృద్ధి ఎక్కడ ఉంది...స్మార్ట్ సిటీకి మీ మ్యాచింగ్ గ్రాంట్ ఏమయ్యింది. ఓరుగల్లు నుండే మీ పతనం స్టార్ట్ అయ్యింది. ఒక మాస్టర్ ప్లాన్ లేకుండా నగర అభివృద్ధి ఎలా సాధ్యం అంటూ మంత్రి కేటీఆర్‌పై రావు పద్మ ప్రశ్నల వర్షం కురిపించారు.

# నరగ వాసులకు ఊరటనిచ్చిన వర్షం

## ఈదురుగాలులతో పలుచోట్ల వాన



**హైదరాబాద్, ఏప్రిల్ 21 (అక్షర వెలుగు):** ఉక్కపోతతో ఉడికిపోతున్న నగరవాసులకు వరుణుడు ఒక్కసారిగా ఊరటనిచ్చాడు. నగరంలో పలు ప్రాంతాల్లో కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడింది. బలమైన ఈదురు గాలులకు కొన్ని ప్రాంతాల్లో చెట్లు నేల మట్టమయ్యాయి. భారీ వర్షాలతో శంషాబాద్ విమానా శ్రయానికి వచ్చే 4 విమానాలకు వెనక్కి పంపారు. రాజధాని నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఈదురు గాలులలో కూడిన వాన రావడంతో కొన్ని ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. కూకట్ పల్లి, మేడ్చల్, బాలానగర్, ఎంజె మార్కెట్, అబిడ్స్, బషీర్ బాగ్, నాంపల్లి, బేగం బజార్ పరిసర ప్రాంతాల్లో వర్షం కురిసింది. భారీగా ఈదురుగాలులు వీయడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పాతబస్తీలోని మలక్‌పేట్ ప్రాంతంలో భారీవృక్షం నేలమట్టమైంది. బలమైన ఈదురుగాలులకు తీగలగూడలో చెట్టు కూలిపోవడంతో ద్విచక్రవాహనం ధ్వంసమైంది. శంషాబాద్‌లో కురిసిన భారీవర్షం విమానాల రాకపోకలపై ప్రభావం చూపింది. హైదరాబాద్ రావల్సిన 4 విమానాలను వాతావరణం సరిగా లేదని అధికారులు వెనక్కి పంపారు. మలక్‌పేట్, మూసారాంబాగ్, చాదర్‌ఘాట్, కోఠి, అబిడ్స్, దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి, ఎల్బీనగర్, కొత్తపేట, అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, కొండాపూర్, మియాపూర్ ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వాన పడింది. బలమైన ఈదురుగాలులకు అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ఓ భవనంపై ఉన్న భారీ హోర్డింగ్ పక్కకు ఒరిగింది. మరోచోట పాత భవనం కూలిపోయి ఓ వృద్ధరాలికి తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని పలుప్రాంతాల్లో వర్షం పడడంతో మధ్యాహ్నం వరకు విపరీతంగా ఎండవేడిమికి ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వనస్థలిపురం, హయత్‌నగర్‌లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. యూసఫ్‌గూడ, పంజాగుట్ట, జూబ్లీహిల్స్, ఫిల్మినగర్, మాదాపూర్, కొండాపూర్, హైటెక్‌సిటీ తదితర ప్రాంతాల్లో వర్షం పడింది. పగటిపూట వేసవి తీవ్రత దారుణంగా ఉంటుండగా... సాయంత్రం వేళ వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఉదయమంతా ఉష్ణోగ్రతల ప్రభావంతో... ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. సాయంత్రం పూట గాలీవాన బీభత్సంతో ఇబ్బందులు పడుతున్నారు.

## తీవ్ర నష్టాల్లో హైదరాబాద్ మెట్రో

(మొదటి పేజీ తరువాయి) హైదరాబాద్ మెట్రో రైల్ నిర్వహణపై కొందరు ఇష్టం వచ్చినంటూ మాట్లాడుతున్నారని... ప్రపంచంలోనే ఇంత పెద్ద మెట్రో రైల్ నిర్మాణం లేదని చెప్పుకొచ్చారు. పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో హైదరాబాద్ మెట్రో రైల్ నిర్మాణ జరిగే సమయంలో చాలా మంది ఇది సాధ్యపడే ప్రాజెక్టు కాదంటూ హేళన చేశారని గుర్తుచేశారు. ఎన్ని అవరోధాలు వచ్చిన మెట్రో నిర్మాణం పూర్తి చేసి, విజయవంతంగా నడిపిస్తున్నామని ఆయన తెలిపారు. మెట్రో ఫేస్ 2 నిర్మాణం కోసం ఫోకస్ దృష్టిసారించామన్నారు. మెట్రో ఫేస్ 2 శంషాబాద్ ఎయిర్ పోర్ట్ మెట్రో నిర్మాణం ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఇందుకు రూ.5 వేల కోట్లతో పెట్టుబడి పెట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వాములైయ్యేందుకు ఎవరైనా ముందుకు రావచ్చన్నారు. ఇప్పటి వరకు హైదరాబాద్ మెట్రో ద్వారా 3 వేల కోట్ల నష్టం వచ్చిందన్నారు. నష్టాలు వస్తున్నా హైదరాబాద్ మెట్రోను మధ్యలో వదిలి వేయకుండా ఎల్ అండ్ టీ నిర్వహణ చేస్తుందని తెలిపారు. ఎల్.అండ్.టి లేకుంటే ప్రభుత్వానికి రూ.20 వేల కోట్లు భారం పడేదన్నారు. మెట్రో ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకే మెట్రో రైడ్ పేరుతో ఎలక్ట్రిక్ ఆటోలను అందుబాటులోకి తీసుకొచ్చామని అన్నారు.

## కౌన్సిలర్ రవినాయక్ దారుణహత్య

(మొదటి పేజీ తరువాయి) తరలించారు. కొద్దిరోజులుగా కొంతమంది నేతలతో బానోత్ రవినాయక్ తీవ్రంగా విభేదిస్తూ వస్తున్నట్లు తెలుస్తోంది. తనకు ప్రాణహాని ఉందని కూడా స్వయంగా కొంతమంది తన సన్నిహితులతో రవినాయక్ పేర్కొన్నట్లు సమాచారం. ఈక్రమంలోనే రవినాయక్ హత్యకు గురికావడం గమనార్హం. రవినాయక్‌కు భార్య పూజ, ముగ్గురు పిల్లలున్నారు. కౌన్సిలర్ హత్యకు సంబంధించి పోలీసులు దర్యాప్తు వేగం చేశారు. ఈ సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేసిన పోలీసులు మొదటి ట్రాక్టర్ తో అడ్డగించి, కారులో వచ్చిన వాళ్ళు గొడ్డలితో దాడి చేసినట్లు, లావాదేవీల వివాదమే హత్యకు కారణమని ప్రాథమిక విచారణలో నిర్ధారణకు ఎస్పీ శరత్ పవర్ చంద్ర తెలిపారు. ఈ హత్య ఛేదించేందుకు 4 పోలీసు బృందాలను ఏర్పాటు చేశామని, దర్యాప్తు వేగం పెంచామని ఆయన తెలిపారు. ఈ దాడి సమయంలో రవినాయక్ ఒంటరిగా ఉన్నాడని, దాడి చేసిన అనంతరం దుండగులు పరారయ్యారని, వీరిలో ఇప్పటికే ఇద్దరు అనుమానితులను గుర్తించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. వారిని అదుపులోకి తీసుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు తెలిపారు.

శుక్రవారం | 22 | ఏప్రిల్ | 2022
www.aksharavelugu.com
జనం కోసం - మన అక్షరం
అక్షర వెలుగు తెలుగు దిన పత్రిక



# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి



**గండీడ్, ఏప్రిల్ 21 (అక్షర వెలుగు):** మండల పరిధిలోని చిన్న వార్వాల్ గ్రామంలో వరి కొనుగోలు కేంద్రం ను ప్రారంభించిన పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ఈ సందర్భంగాఎమ్మెల్యే మాట్లడుతూ.. గత ప్రభుత్వాలు రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యాక ముఖ్య మంత్రి కేసీఆర్ రైతుల కష్టాలను తెలంగాణ ఉద్యమ సమయంలో స్వయంగా చూసి చలించిపోయారని, అందుకే నేడు రైతులను అన్ని విధాల ఆదుకుంటున్నారని అన్నారు. రైతు బంధు, రైతు బీమా, పండించిన పంటలకు గిట్టుబాటు ధర, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడం వంటి అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం కల్పిస్తోందని ఎమ్మెల్యే రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గండీడ్ మండల ప్రజాప్రతినిధులు, స్థానిక గ్రామ సర్పంచ్, గ్రామ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షాలతో పంట నష్ట పోయిన రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలి

### సీపీఐ డిమాండ్



**పరిగి, ఏప్రిల్ 21 (అక్షర వెలుగు):** పరిగి మండల పరిధిలో నరాయనపూర్ సుల్తానాపూర్ రంగంపల్లి గ్రామాల్లో ఈదురు గాలితో వడ గళ్ళతో కూడిన భారీ వర్షం కురవడం వలన పంటలుకు నష్టం వాటిల్లిందని నష్ట పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని సీపీఐ పార్టీ పరిగి డివిజన్ కార్యదర్శి పీర్ మహమ్మద్ పరిగి మండల కార్యదర్శి ఎం.వెంకటేష్ లు ప్రభుత్వ ని డిమాండ్ చేశారు .ఈకార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీశైలం చెందు తదితరులు పాల్గొన్నారు.

# దాతల సహకారంతో బాల వెలుగు విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 21(అక్షర వెలుగు):** దాతల సహకారంతో బాల వెలుగు పాఠశాల విద్యార్థిని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలనీ ఒక మనిషి ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే చదువును మించిన సన్మార్గం మరొకటి లేదని మణుగూరు ఏరియా జి ఎం జక్కం రమేష్ అన్నారు సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో లో పి వి కాలనీ ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రం లో శిక్షణ పొందిన వారి సహకారంతో గురువారం మధ్యాహ్నం సంతోష్ నగర్ బాల వెలుగు పాఠశాలలో నిర్వహించిన బియ్యం వితరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు, మణుగూరు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ఆదివాసి, గిరిజన నిరుపేద,అనాథలు అన్నార్తులను చేరదీసి వారికి విద్యాబుద్ధులు నేర్పించి వారి పురోగతికి పాటుపడుతున్న బాల వెలుగు పాఠశాల నిర్వాహకులను వారికి అన్ని విధాలుగా తోడ్పాటును అందిస్తున్న సింగరేణి ఉద్యోగులను వారి కుటుంబ సభ్యులను కార్మిక సంఘాల నాయకులను సింగరేణి సేవా సమితి సభ్యులను ఆయన అభినందించారు, సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో అనేక మంది ఔత్సాహిక యువతీయువకులకు అనేక రకాల వృత్తి విద్య శిక్షణలను తర్ఫీదు ఇచ్చి మరియు వోల్వో డ్రైవింగ్, సైనిక ఉద్యోగాలకు ఉచిత కోచింగ్ తో సింగరేణి సంస్థ ఎంతో మంది యువతీ యువకులు ప్రోత్సహించిందని అలాగే నేర్చుకున్న టైలరింగ్ శిక్షణ లో వృత్తి నైపుణ్యత పెంపొందించుకోవాలని తద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలని ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు, ఏరియా గుర్తింపు సంఘం నాయకులు వి.ప్రభాకర్ రావు మాట్లాడుతూ వృత్తి విద్య మహిళలకు ఆభరణంగా అభివర్ణించారు, ఎంతో మంది మహిళలు యువతులు తాము నేర్చుకున్న టైలరింగ్ ద్వారా ఎంతోకొంత సంపాదిస్తూ చన్నీళ్ళకు వేడినీళ్లు తోడుగా మగవారికి బాసటగా నిలవడం సంతోషకరమన్నారు, అదేవిధంగా 10 నెలల క్రితం తద్వాయి శు భకార్యానికి వెళ్లి జంపన్న వాగులో ఆకస్మిక ఉద్ధృతి ప్రమాదంలో మృతి చెందిన కొత్త కొండాపురం గ్రామస్తుడు ఉడిముడి కోటేశ్వరరావు భార్య మీనాక్షికి టైలరింగ్ శిక్షకురాలు సేవా సభ్యురాలు ఎస్ డి జమీల 50 కేజీల బియ్యాన్ని నిత్యవసర వస్తువులను అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు టైలరింగ్ శిక్షణ పొందిన సభ్యులచే జీఎం దంపతులు జక్కం రమేష్ ఏరియా సేవా అధ్యక్షురాలు శ్రీ మతి వాణి రమేష్ దంపతులను శాలువాతో ఘనంగా సత్కరించారు, స్థానిక కళాకారుడు రామకృష్ణ స్వీయ రచనలో పాఠశాల విద్యార్థిని విద్యార్థులు ఆలపించిన పాటలు అందరిని అలరించాయి అనంతరం అందరికీ బిస్కెట్లు ,పండ్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ఏరియా గుర్తింపు సంఘం ఉపాధ్యక్షులు వి ప్రభాకర్ రావు, ఇల్లెందు క్లబ్ కార్యదర్శి ప్రముఖ పాత్రికేయురాలు సామాజిక సేవకులు శ్రీమతి అనిత లలిత్ కుమార్, సింగరేణి సేవా సమితి సభ్యులు ఎస్ డి నాసర్ పాషా, సేవా సభ్యురాలు జమీల బేగం,పైలెట్ కాలనీ బ్యూటిషన్ కోర్స్ శిక్షకురాలు పోతుగంటి సంధ్యరాణి నాగార్జున దంపతులు, టైలరింగ్ శిక్షణ పొందిన మహిళలు ప్రశాంతి,వరుణ కుమారి, రమాదేవి, నవ్యశ్రీ, సావిత్రి, నాజియా, సమీనా, స్పందన, ఫర్హాన, శృతి, సంధ్యారాణి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# హైమద్ పటేల్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు




**దోమ ఏప్రిల్ 21 (అక్షర వెలుగు):** మండల పరిధిలోని దిర్సంపల్లి గ్రామంలో హైమద్ పటేల్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిసిసిబి చెర్మన్ మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో, సర్పంచ్ సంఘాల అధ్యక్షుడు కె రాజిరెడ్డి, బంగ్లా యాదయ్య హ్యూమన్ రైట్స్ తెలంగాణ వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ షఫీ మరియు దోమ మండల సర్పంచ్లు ప్రజా ప్రతినిధులు ముస్లిం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు




**పెద్దపెల్లి, ఏప్రిల్ 21 (అక్షర వెలుగు):** గురు వారం మంథని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంథని మండలం (33),కమాన్ పూర్ మండలం (8), ముత్తరం మండలం (20) రామగిరి మండలము (29) కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు మరియు CMRF లబ్ధిదారులు 45 మందికి చెక్కులను మన మాజీ మంత్రివర్యులు, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పంపిణీ చేశారు, రాహుల్ గాంధీ బహిరంగ సభను విజయవంతం చేయండిఎమ్మెల్యే దుద్దిళ్ళ సోనియా గాంధీ గొప్ప నిర్ణయంతో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు చెన్నూరు కు ఎత్తిపోతల పథకం మంజూరు చేసి మంథని ప్రాంతాన్ని చిన్న చూపు చూడడం దురదృష్టకరం మంథని ప్రాంతాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి రాహుల్ గాంధీ వస్తున్నారు. మంథని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాజీ మంత్రి వర్యులు మంథని ఎమ్మెల్యే శ్రీ దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ మే 6వ తేదీన భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ వరంగల్ లో జరిగే భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ అన్ని విభాగాల నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల మిత్రులు ప్రతి ఒక్కరూ పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయండి. టిఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం గత ఎనిమిది సంవత్సరాల నుండి పరిపాలన చేస్తున్న నేపథ్యంలో పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు రైతులకు చేస్తున్న అన్యాయాన్ని ప్రజలకు తెలియజేశాం. నీళ్లు నిధులు నియామకాల కోసం తెచ్చుకున్న తెలంగాణ ఒకే కుటుంబానికి పరిమితమైపోయింది. తెలంగాణ ఉద్యమం కోసం ఉద్యమించిన ప్రతి ఒక్కరికి న్యాయం జరగాలంటే తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ వైపు ప్రజలందరూ మొగ్గు చూపాలి. రైతులు పండించిన యాసంగి పంట కొనుగోలు విషయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆడుతున్న డ్రామాలను ప్రజలందరూ గుర్తించాలి. యాసంగి వరి పంటను కొనుగోలు చేయమని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడంతో 50 నుండి 60 శాతం వరకు పంట పొలాలు బీడు భూములుగా మారాయి. బీడు భూములుగా మారిన పంటపొలాలకు నష్టపరిహారం చెల్లించాలి. కాళేశ్వరం ప్రాజెక్టు లో భాగంగా మూడు బ్యారేజీలు నిర్మాణం చేశారు బ్యారేజీ నిర్మాణం తరువాత అనేకమంది ఇండ్లు భూములు ఉపాధి కోల్పోయి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చితుకబాడింది. ఇసుక మాఫియా వల్ల మంథని ప్రాంత ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారు. అనేక సందర్భాల్లో గౌరవ ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకెళ్లాం అసెంబ్లీ వేదికగా మంథని నియోజకవర్గ ప్రాంతం రైతాంగం కోసం పోతారం లిఫ్ట్ ఏర్పాటుచేసి టేలెంట్ ప్రాంతం రైతులకు సాగు నీరు అందించాలని కోరాము. కెనాల్ నీరు రాకుండా సాగుకు నోచుకోని పొలాలకు లిఫ్ట్ లు నిర్మాణం చేసి సాగునీరు అందించాలి. మంథని నియోజకవర్గంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేసి ఇక్కడి ప్రజలకు నిరు అందించకుండా ఇతర ప్రాంతాలకు తరలించడం బాధాకరం, వెంటనే ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేసి మంథని నియోజక వర్గ ప్రాంత రైతాంగానికి సాగునీటిని అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. గత మూడు సంవత్సరాల నుండి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో జరుగుతున్న అవినీతి అక్రమాలు, యువత ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, మూడెకరాల భూమి, 12 శాతం మైనార్టీలు రిజర్వేషన్, జనాభా దామాషా ప్రకారం ఎస్టీ రిజర్వేషన్, 57 సంవత్సరాల పెన్షన్ వీటన్నిటి పై రాహుల్ గాంధీ వరంగల్ సభలో ప్రస్తావించనున్నారు అని మాజీ మంత్రి వర్యులు మంథని ఎమ్మెల్యే శ్రీ దుద్దిళ్ళ శ్రీధర్ బాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# పోతారం ఎత్తిపోతల పథకం మంజూరు అయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురండి



**పెద్దపెల్లి, ఏప్రిల్ 21 (అక్షర వెలుగు):**¯ పోతారం ఎత్తిపోతల పథకం సాంక్షన్ అయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురండి మంథని ఎమ్మెల్యే కు వినతి పత్రం అందజేసిన మంథని మాజీ జెడ్పిటిసి సరోజన గురు వారం మంథని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రివర్యులు మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు లి కాళేశ్వరం ప్రాజెక్టు అనుసంధానంగా రాష్ట్ర ప్రభుత్వం మంథని ప్రాంతంలో ఎత్తిపోతల పథకాలు చేపడుతుందని రైతులు రెండేళ్లుగా ఎదురుచూస్తున్నారు కానీ ఇటీవల జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గం లో సాగునీరు తాగునీటి ఎత్తిపోతల పథకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది చెన్నూరు కంటే ముందు నుంచి మంథని నియోజకవర్గంలో 3 పథకాలకు ప్రతిపాదనలు చేసి సర్వేలు పూర్తిచేసిన ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరం మంథని మండలం సిరిపురం సమీపంలో పార్వతి బ్యారేజ్ ద్వారా పోతారం వద్ద ఎత్తిపోతల పథకానికి 200 కోట్లు అవసరమని అంచనాలు సైతం తయారు చేశారు మంథని నియోజక వర్గ ప్రాంతం టేలాండ్ ప్రాంతంకావడంతో నీరు అందక 30 వేల ఎకరాలు బీడుగా మారింది మంథని నియోజకవర్గంలో ప్రాజెక్టు నిర్మించిన ప్రభుత్వం ఇక్కడ రైతాంగానికి మొదటి ప్రాధాన్యత ఇస్తానని మొదటినుంచి చెప్పుకొస్తూ రైతాంగానికి మొండిచేయి చూపించడం బాధ్యతారాహిత్యం రైతాంగానికి అండగా ఉండి ఈ ప్రాంతం ఎత్తిపోతల పథకం సాంక్షన్ అయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని మంథని మాజీ జెడ్పీటీసీ మూల సరోజన లిమంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు వినతి పత్రం అందజేశారు.

# ఎడమ కాలువకు నీటి విడుదల నిలిపివేత

**నాగార్జునసాగర్, ఏప్రిల్ 21, (అక్షర వెలుగు):** నాగార్జునసాగర్ ఎడమ కాలువ నీటి విడుదల ను గురువారము నిలిపివేశారు. ఎడమ కాలువ ద్వారా 137 .67 టిఎంసిల నీటిని విడుదల చేశారు గత ఏడాది జూన్ నుండి ఈ నెల 20 తేది వరకు ఎడమ కాలువకు నీటి విడుదల చేశారు. సాగర్ ప్రస్తుత నీటి మట్టం539.70 అడుగులు టీఎంసీలలో187.7029 సమానం ఎస్ఎల్బీసీ 2200 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుంది. సాగర్ జలాశయం నుంచి పూర్తి నీటి విడుదల2500 క్యూసెక్కుల నీరు విడుదలవుతుంది, సాగర్ జలాశయానికి ఇన్ఫ్లో2500 క్యూసెక్కుల నీరు వస్తుంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం811.80 అడుగులు శ్రీశైలం జలాశయానికి ఎగువ నుంచి నీటి రాక లేదు

# అమ్మానాన్నలను అనాధాశ్రమాలకు పంపకండి మనకు లోకాన్ని పరిచయం చేసింది తల్లిదండ్రులు అని మరవకండి

### మక్కపల్లి కరుణాకర్




**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 21 (అక్షర వెలుగు):** ప్రపంచ దేశాల్లో విందులు వినోదాలకు మొదటగా ప్రాధాన్యత ఇచ్చే యువతకు ఒక గుణపాఠంగా నేడు ఓ యువకుడు నక్కర్త మేడిపల్లి గ్రామానికి చెందిన మక్కపల్లి కరుణాకర్ తన పుట్టినరోజు సందర్భంగా యువకులకు విందులకు పరిమితం కాకుండా మాతా, పితరుల సేవాసదన్‌లో గురువారం తాను ఏదో విధంగా సహాయం చేయాలని పూనుకొని మాతాపితరుల సేవాసదన్ కు అల్పాహారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తన పుట్టినరోజు మాతాపితరుల సేవాసదన్ లో జరుపుకోవడం వారి ఆశీర్వాదం నాకు ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇలాగే ప్రతి సంవత్సరం నా పుట్టినరోజు వేడుకలు ఇక్కడనే జరుపుకుంటారని తెలిపారు. మనం ఈ స్థితిలో ఉన్నానంటే కేవలం తల్లిదండ్రుల వల్లనే అని మర్చిపోయిన వారికి తెలియజేస్తున్నానని అన్నారు .తల్లిదండ్రులను ఇందులో వదిలేసి వెళ్లిన ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఈ ఫౌండేషన్ కి నా తరఫున ఏలాంటి అవసరం ఉన్నా చరవాణి ద్వారా నాకు అందిస్తే నేను అందుబాటులో ఉంటానని ఫౌండేషన్ సభ్యులకు తెలియజేశారు.

# వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలకు రోజు కూలీ 600 రూ॥ లకు 200 రోజుల పని దినాలు పెంచాలి




**దోమ, ఏప్రిల్ 21 (అక్షర వెలుగు):** దోమ మండలం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలకు రోజు కూలీ 600 రూ॥ లకు, 200 రోజుల పని దినాలు పెంచాలని, పనిప్రదేశాల్లో త్రాగే నీరు, నీడ, మెడికల్ కిట్ ఎటువంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు, ఇతర సమస్యలు పరిష్కరించాలని నేడు దోమ ఎంపిడిఓ కార్యాలయం ముందు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసా కార్మిక సంఘం మండల అధ్యక్షులు తిమ్మాయి పల్లి సత్యయ్య మాట్లాడుతూ... కేంద్ర బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్రలు పన్నుతున్నారని అన్నారు. దోమ మండలం లో అనేక గ్రామాలలో ఆరు వారాల పెండింగ్ బకాయిలు కూలీలకు ఉన్నాయన్నారు. కూలీలకు ప్రమాద బీమా సౌకర్యం పది లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు గంపలు, గడ్డపారలు ఇలాంటి పనిముట్లను ప్రభుత్వం మంజూరు చేయాలని అన్నారు. కొలతలను తొలగించి రోజుకు 600 రూపాయలు ఇవ్వాలని.. ఇప్పటికైనా ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని లేకపోతే దేశవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.సంఘం నాయకులు శేఖర్,వెంకట్రాంరెడ్డి, బసప్ప, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

# జయశంకర్ స్టేడియం వేదికగా కేసీఆర్ క్రికెట్ టోర్నీ ఫైనల్

### ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు



**సిద్దిపేట్, ఏప్రిల్ 21 (అక్షర వెలుగు):** సిద్ధిపేట జయశంకర్ స్టేడియం వేదికగా కేసీఆర్ క్రికెట్ టోర్నీ ఫైనల్ మ్యాచ్ కు రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు, అంతర్జాతీయ క్రికెట్ దిగ్గజం వెంకటపతి రాజు, ప్రముఖ సినీ నటుడు సుమన్, హెచ్ సీఏ సెలక్టర్లు ఫయాజ్, అహ్మద్ ఖాద్రీ, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. ఎంసీసీ వర్సెస్ ముంద్రాయి జట్ల మధ్య హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్ లో ఎంసీసీ జట్టు విజేతగా నిలిచింది. ఈ మేరకు విన్నర్, రన్నరప్ జట్లకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మ్యాచ్ ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ కామెంట్స్: సీఎం కేసీఆర్ జన్మదినోత్సవ సందర్భంగా ప్రారంభించిన క్రికెట్ టోర్నీ చాలా బాగా నిర్వహించిన నిర్వాహకులను అభినందనలు. సీఎం కేసీఆర్ టోర్నీ నిర్వహణతో రంజీ, జాతీయ స్థాయిలో క్రీడలకు వెళ్లే ఆకాంక్ష ఇవాళ ఫలిస్తుంది. అదృష్టాన్ని నమ్ముకుని కాదు. కష్టాన్ని, శ్రమను నమ్ముకుని ఆట ఆడాలి. గెలవాలని పట్టుదలతో.. శ్రమతో కష్టాన్ని నమ్మితే గెలుపు సాధ్యం. ఓటమి మనకు తెలుస్తుంది. గెలుపు అందరికీ తెలుస్తుంది. ప్రతీ మనిషిలో ప్రతిభ ఉంటుంది. ఎప్పటికీ ఇదే ప్రతిభను ప్రదర్శిస్తే దేశం సిద్ధిపేట వైపు చూస్తుంది. క్రికెట్ క్రీడ పోటీ తత్వాన్ని చూపిస్తదని, ఆల్ రౌండర్ అవకాశం క్రికెట్ లో ఉంటుంది. మీరంతా మీ జీవితంలో ఆల్ రౌండర్లు కావాలి. సిద్ధిపేటను క్రీడా హబ్ గా చేస్తున్నాం. పక్కనే ఇంటర్నేషనల్ ప్రమాణాలతో ఫుట్ బాల్ స్టేడియం, ఆ పక్కనే స్విమ్మింగ్ పూల్ చేసుకున్నాం. హెచ్ సీఏకు రెండు జట్ల నుంచి క్రీడాకారులు వెళ్లాలన్నదే నా ఆకాంక్ష. ఎంసీసీ బెస్ట్ టీమ్. అలాగే గ్రామీణ ప్రాంతం నుంచి మంచి ఆట ప్రదర్శించి ముంద్రాయి కూడా బెస్ట్ టీమ్ గా నిరూపించారు. క్రికెట్ క్రీడాకారుడు వెంకటపతి రాజు మంత్రి హరీశ్ రావు నేతృత్వంలో సిద్ధిపేటలో క్రీడలకు ధోకలేదు. 257 జట్లు మ్యాచ్ లు ఉన్నాయంటే.. వాటిని ఆర్గనైజ్ చేయడం చాలా గ్రేట్. విన్నర్స్, అండ్ రన్నర్స్ టీమ్ కు నా అభినందనలు. సినీ నటుడు సూపర్ స్టార్ సుమన్ మంత్రి హరీశ్ రావు సిద్ధిపేట అభివృద్ధిని చాలా బాగా తీర్చిదిద్దారు. మొదటిసారి సిద్ధిపేటకు వచ్చా. కోమటి చెరువు చూసి సిద్ధిపేటలో ఉన్నానా..? హైదరాబాదులో ఉన్నానా అనే ఫీలింగ్ వచ్చింది. బోటింగ్ షికారు చేశాం. సినిమాలకు పర్మిషన్ ఇస్తే .. సిద్ధిపేటలో షూటింగ్ చేస్తాం. హెచ్ సీఏ సెలెక్టర్ అహ్మద్ ఖాద్రీ ఇప్పటికే సిద్ధిపేట నుంచి ముగ్గురిని హెచ్ సీఏకు ఎంపిక చేశాం. మరో 3, 4 మంది క్రీడాకారులను ఎంపిక చేస్తాం. సిద్ధిపేట స్టేడియంలో ఐపీఎల్ తరహాలో మ్యాచ్ జరిగింది. హెచ్ సీఏ సెలెక్టర్ ఫయాజ్ మూడవసారి సిద్ధిపేట రావడం. సిద్ధిపేటకు రావడం అంటే.. ఇష్టం. మీ క్రీడ చూడాలని పసందుగా వచ్చా. పిలిస్తే మళ్లీ వస్తా. విన్నర్స్, రన్నర్స్ కు శుభాకాంక్షలు తెలిపారు.

# 111జీవో రద్దుతో జంట జలాశయాలకు ముప్పు



(మొదటి పేజీ తరువాయి) 111 జీవో రద్దు అంటూ ట్విటర్ వేదికగా రేవంత్ పేర్కొన్నారు. ఈ జీవోపై 2007లో హైకోర్టు స్టే విధించిన విషయాన్ని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. హైకోర్టు ఆదేశాలకు భిన్నంగా 69 జీవో చెల్లదని ఆయన స్పష్టం చేశారు.కేటీఆర్ రియల్ ఎస్టేట్ మాఫియా కోసమే ఈ డ్రామా అని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. వారికి అండగా నిలిచే క్రమంలో జీవో రద్దు కుట్రకు తెరలేపారని అన్నారు. దీనిపై ప్రజలు తిరుగుబాటు చేయాలన్నారు. లేకుంటా హైదరాబాద్ జలాశయాలు మురికికూపాలు కాగలవని అన్నారు. ఇదిలావుంటే కేటీఆర్ ఫ్రస్టేషన్‌తో ప్రజా సమస్యలపై చర్చ రాకుండా తిట్ల మీదే చర్చ వచ్చేలా మాట్లాడారని ఏఐసీసీ జాతీయ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ ఆరోపించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర బీజేపీ ప్రభుత్వానికి 3 లక్షల కోట్ల పైచిలుకు ఇస్తే.. ఒక కోటి ఆరవై లక్షలు మాత్రమే తెలంగాణకు ఇచ్చిందని టీఆర్ఎస్ నేతలు వ్యాఖ్యానించడం ఏంటని, అవి టీఆర్ఎస్, బీజేపీ పైసలు కాదు..ప్రజలు కట్టిన టాక్స్‌లు.. అని ఆయన మండిపడ్డారు. ప్రజల సమస్యలు పరిష్కరించాల్సింది తిట్ల పురాణం రాజకీయం ఏంటని ఆయన ప్రశ్నించారు. 111 జీవోపై 2016 లో హైపవర్ కమిటీని ఏర్పాటు చేశారని, ఆ కమిటీ రిపోర్ట్ 31 మార్చి 2022 రిపోర్ట్ ఇచ్చినట్టు జీవో తెలిపారన్నారు. 111జీవోపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు. జీవో 111పై హైపవర్ కమిటీ ఇచ్చిన నివేదికను బహిర్గతం చేయాలని దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు. 111జీవోపై 2016లో హైపర్ కమిటీ ఏర్పాటు చేయగా.. 2022 మార్చి 31న కమిటీ రిపోర్టు ఇచ్చినట్లు ప్రభుత్వం జీవోలో తెలిపింది. అయితే ఆ రిపోర్టులో పొందుపరిచిన అంశాలను బహిర్గతం చేయాలని అన్నారు. జీవో రద్దుతో నగరంలోని జంట జలాశయాలు కూడా మరో హుస్సేన్ సాగర్ లా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాష్ట్రంలో నాయకులు ప్రజా సమస్యలపై చర్చించకుండా.. తిట్ల రాజకీయాలు నడుపుతున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం మేకిన్ ఇండియా పేరుతో చైనా కంపెనీలకు కాంట్రాక్టులు కట్టబెడుతోందని దాసోజు ఆరోపించారు.

# ఆమ్ ఆద్మీ పార్టీలో చేరికలు



**హైదరాబాద్, ఏప్రిల్ 21 (అక్షర వెలుగు):** మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజక వర్గానికి చెందిన టిఆర్ఎస్ నాయకుడు జనార్దన్ తన అనుచరులతో హైదరాబాద్లో రాష్ట్ర పార్టీ ప్రదాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీలో చేరారు వారిని తెలంగాణ రాష్ట్ర పార్టీ చైర్ పర్సన్ శ్రీమతి ఇందిరా శోభన్ గారు వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు, ఈ సందర్భంగా జనార్దన్ గారు మాట్లాడుతూ ఢిల్లీలో అరవింద్ కేజ్రివాల్ నాయకత్వములో అప్ ప్రభుత్వము చేస్తున్న ప్రజా అభివృద్ధి కార్యక్రమాలు పిల్లలకు నాణ్యమైన ప్రపంచ స్థాయి విద్య ,ప్రజలందరికీ ఉచిత నాణ్యమైన వైద్య సేవలు, ఇంటివద్దకు సేవలు, ఉచిత మంచి నీరు లాంటి కార్యక్రమాలు చూసి తెలంగాణ లో కూడా అరవింద్ కేజ్రివాల్ పాలన కోసం తాను అప్ లో చేరానని తెలంగాణాలో పార్టీ బలోపేతం గురించి శ్రీమతి ఇందిరా శోభన్ గారి నాయకత్వములో కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనార్దన్ గారి ఆధ్వర్యంలో పార్టీ చేరిన వారి అనుచరులను శ్రీమతి ఇందిరా శోభన్ గారు అభినందించారు మరియు తెలంగాణ రాష్ట్రంలో జనార్దన్ లాంటి నాయకులు చేరడం ఇక్కడ ఆమ్ ఆద్మీ పార్టీ అవసరాన్ని నొక్కి చెబుతున్నాడని తెలిపారు.

# నగరానికి నలువైపులా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు



(మొదటి పేజీ తరువాయి) స్పష్టం చేసింది. నగర శివార్లలో నలు దిక్కులా నాలుగు సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రులు నిర్మాణం అయితే పెద్ద సంఖ్యలో రోగులకు వైద్య సేవలు అందిస్తోన్న గాంధీ, ఉస్మానియా, నిమ్స్ లపై ఒత్తిడి తగ్గనుంది. గచ్చిబౌలి, అల్వాల్, సనత్ నగర్, ఎల్బీనగర్లలో నిర్మించే ఈ ఆస్పత్రుల నిర్మాణం వల్ల జిల్లాల నుంచి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించవచ్చు. అల్వాల్లో ఏర్పాటు చేసే ఆసుపత్రికి సంగారెడ్డి, సిద్దిపేట, ఆదిలాబాద్ జిల్లాల నుంచి వచ్చే రోగులు చక్కటి వైద్యం పొందే అవకాశం ఉంది. అదే రీతిలో ఎల్బీనగర్ ఆస్పత్రికి ఖమ్మం, నల్గొండ, సూర్యపేట జిల్లాల నుంచి వచ్చే రోగులు వైద్యం పొందే వీలుంది. అదే రీతిలో గచ్చిబౌలి, సనత్ నగర్ ఆస్పత్రులకు వచ్చే రోగులకు కూడా నాణ్యమైన వైద్య సేవలు అందనున్నాయి. గతంలో ఏదైనా అత్యవసర వైద్య సేవలు కావాలంటే నిమ్స్ కో, గాంధీకో తరలించాల్సిన పరిస్థితి ఉండేది. ట్రాఫిక్ కారణంగా అందాల్సిన వైద్యం సకాలంలో అందక రోగులు చనిపోయిన సందర్భాలు ఉన్నాయి. నగరం నలుదిక్కులా సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రుల నిర్మాణం పూర్తయితే జిల్లాల నుంచి అత్యవసర వైద్య సాయం కావాల్సిన రోగులకు ట్రాఫిక్ బెడద లేకుండా నగర శివార్లలోనే అత్యుత్తమ, అత్యవసర వైద్య సేవలు అందించే అవకాశం కలుగుతోంది. దీంతో పాటు గాంధీ, నిమ్స్, ఉస్మానియా ఆసుపత్రులకు రోగుల ఒత్తిడి తగ్గుతుంది.

# సిసి కెమెరాల ఏర్పాటు దాత యత్తపు మధుసూదనరావు



**చండూరు, ఏప్రిల్ 21 (అక్షర వెలుగు):** చండూరు ఎస్ఐ నవీన్ కుమార్ విజ్ఞాపన మేరకు స్వగ్రామం తుమ్మలపల్లిలో గ్రామ పంచాయతీ ప్రజల కోసం ఒక లక్ష ఎనభై వేలు రూపాయలు సిసి కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్నట్లు దాత యత్తపు మధుసూదనరావు తెలిపారు. తుమ్మలపల్లిలో మంగళవారం జరిగిన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ ప్రమాన స్వీకారానికి హాజరై, ఆయన కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డితో కలిసి సంబంధిత పోలీస్ వారికి డబ్బులు అందజేశారు.అంతే కాకుండా గతంలో రామలింగేశ్వర స్వామి శివలింగం కొరకు రెండు కేజీల వెండి నాగపడిగా చేయించి, జాతర ఉత్సవాలకు 40 లక్షలు సుమారు ఒక ఎకరం స్థలం కొనుగోలు చేసి ఆలయానికి అందచేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం సుందరికరన కోరకు కార్యాలయం శుద్ధి, కావలసిన ఫర్నీచర్, కాలర్, పెయింట్, వేయించారు. గ్రామంలోని మొక్కల భద్రత కోసం ట్రీ గార్డ్స్ వంటి ఎన్నో రకాల దానాలు చేసి గొప్ప దానగుణం సేవాగుణం వంటి వాటిలో ముందుంటారని పలువురు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గుర్రం వెంకట్ రెడ్డి, పాటల వెంకన్న, కురుపాటి సుదర్శన్, గ్రామ సర్పంచ్ కురుపాటి రాములమ్మ, పెద్దగాని వెంకన్న, గజ్జెల కృష్ణారెడ్డి, కురుపాటి సైదులు, బొయపల్లి రాజు, కురుపాటి లక్ష్మన్, ఉజ్జిని అనీల్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# సివిల్ సర్వెంట్లు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలి



రైతుల కల్లాల వద్దకే మార్కెట్ రావాలి
లాభసాటి పంటలతో రైతులు ఎదగాలి
అదే సిఎం కెసిఆర్ ఆకాంక్ష అన్న మంత్రి నిరంజన్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 21 (అక్షర వెలుగు):** తెలంగాణలో పంటల మార్పిడిలో భాగంగా ప్రభుత్వం వరి పంట వేయద్దని అంటున్నదే కానీ వరి పై ఆంక్షలు కాదని, లాభసాటి పంటలే అని ప్రభుత్వం స్ఫూర్తి ప్రదాత కావాలన్నదే సీఎం కేసిఆర్ ఆకాంక్ష అని ఆయన పేర్కొన్నారు. రైతన్న పంటతో మార్కెట్ వరకు పోవడం కాదు... .తెలంగాణ రైతు పంట కల్లం కాడికే మార్కెట్ రావాలన్నదే ముఖ్యమంత్రి కేసిఆర్ ఆలోచనఅని చెప్పారు. గురువారం ఆయన ఒక ప్రకటన చేస్తూ వ్యవసాయం పట్ల ప్రభుత్వ చిత్త శుద్ధి కొందరు స్వార్థ పరులకు అర్థం కాకున్నా... .రైతన్నలు అర్థం చేసుకున్నరు.. .కాబట్టే ప్రత్యామ్నాయ పంటల దిశగా సాగుతున్నరని చెప్పారు. యాసంగిలో ఇక్కడ పండే వరి ధాన్యం నుండే ఎక్కువ నూకలు వస్తాయని మొదటి నుండి ండి సడలింపు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం కోరుతున్నది లేదా కేంద్ర ప్రభుత్వం నేరుగా బియ్యంతో సంబంధం లేకుండా వడ్లు కొనుగోలు చేయాలని చెబుతున్నాం. యాసంగిలో తెలంగాణ నుండి వచ్చే వడ్లు కొనం అని కేంద్రం స్పష్టంగా చెబుతున్నది. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కూడా ఇదే విషయం చెప్పారు. వానాకాలం ఎవరి ఇష్టం వారిదని, ఈ విషయంలో ఆంక్షలు లేవని మంత్రి తెలిపారు. అయితే వరికి మించి లాభదాయకంగా ఉన్న పత్తి, కంది, పెసలు, మినుముల సాగు వైపు రైతులను శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు. కొందరు స్వార్థపరులు రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని మంత్రి విమర్శించారు. కొందరు రైతులు మాత్రం ప్రభుత్వ సూచనలను అర్థం చేసుకుని ఇతర పంటల సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. రైతు పంటతో మార్కెట్కు వెళ్లకుండా, కల్లం వద్దకే మార్కెట్ వెళ్లాలనేది ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన అని నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు. వరిసాగుపై చేసే సూచనలు ఆంక్షలు కాదని, లాభసాటి పంటలు కోరుతున్నామని తెలిపారు. కొందరు కురచ బుద్ధితో తెలంగాణ విజయాలను మరుగున పడేయాలని చూస్తున్నారని, అలాంటి వారు ఇప్పటికైనా బుద్ధి మార్చుకోవాలని నిరంజన్ రెడ్డి సూచించారు.

# కేంద్ర నిధులపై కేటీఆర్ అసత్యాలు

మోదీని విమర్శించే స్థాయా నీది ● కొకైన్ టెస్టుకు రావాలని సవాల్ ● కెటిఆర్ తీరుపై మండిపడ్డ ఎంపి అర్వింద్



**హైదరాబాద్, ఏప్రిల్ 21 (అక్షర వెలుగు):** కేంద్ర నిధులపై కేటీఆర్ అసత్యాలు మాట్లాడుతున్నారని మంత్రి కేటీఆర్ తీరుపై ఎంపీ అర్వింద్ దుయ్యబట్టారు. మనిషి పిచ్చికుక్కను కరిస్తే కేటీఆర్ లాగే ఉంటాడని సటైర్ విసిరారు. అని ప్రశ్నించారు. తనపై కవిత పోటీ చేస్తే మళ్లీ ఓడిస్తానని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్, కాంగ్రెస్ కలిసి పోటీ చేస్తాయని అర్వింద్ జోస్యం చెప్పారు. కేంద్ర నిధులపై అవాస్తవాలు చెబుతున్నారంటూ ఎంపీ అర్వింద్ మంత్రి కేటీఆర్ పై ఘాటు వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్ పై ఆయన వివాదాస్పద . చేయని పనులు కూడా చేసినట్లు చెప్పి కేటీఆర్ డబ్బా కొట్టుకుంటున్నారని అన్నారు. ఉత్తర కుమారుడు, తుపాకీ రాముడు, బుడ్డర ఖాన్ లను మిక్స్ చేస్తే కేటీఆర్ అవుతాడని అందుకే త్రిపాత్రాభినయం చేస్తున్నాడని అన్నారు. 111 జీవోకు తూట్లు పొడిచి జన్వాడాలో కట్టిన ఫాంహౌస్ ను కేటీఆర్ కూల్చివేయాలని అర్వింద్ డిమాండ్ చేశారు. తెలంగాణలో బియ్యం బ్లాక్ మార్కెట్ పై సీబీఐ విచారణకు ఎన్ఓసీ ఇచ్చే దమ్ము కేటీఆర్ కు ఉందా అని అర్వింద్ ప్రశ్నించారు. బండి సంజయ్ పాలమూరులో యాత్ర చేస్తున్నాడని ఎద్దేవా చేసిన కేటీఆర్.. తన నియోజకవర్గం సిరిసిల్లను వదిలి హనుమకొండలో ఏం చేస్తున్నాడని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కలిసి పోటీ చేస్తాయని.. ఈ మాట నూటికి నూరుశాతం నిజమవుతుందని అన్నారు.

# బస్టాండ్‌లో మెడికల్ షాపులు



(మొదటి పేజీ తరువాయి) ద్వారా ఆదాయం సమకూర్చుకుంటామని చెప్పారు. ప్రయాణి కుల సౌకర్యార్థం అన్ని బస్టాండ్లలో ఫార్మసీ లు ఏర్పాటు చేస్తున్నా మని పేర్కొన్నారు. సీబీఎస్, కాచిగూడ బస్టాండ్లలో మెడికల్ షాపులను ఏర్పాటు చేశామని తెలిపారు. రానున్న రోజుల్లో అన్ని డిపోల్లో మెడికల్ షాపులతో పాటు ఆస్పత్రుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు గోవర్ధన్ పేర్కొన్నారు.




# చలన చిత్రం

## సినిమా తలరాతను ఊహించలేం

### రాధేశ్యామ్ ఫెయిల్యూర్‌పై పూజాహెగ్డే నిర్వేదం

ప్రభాస్, పూజా హెగ్డే జంటగా నటించిన చిత్రం? రాధేశ్యామ్. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం అభిమానుల అంచనాలను అంతగా అందుకోలేకపోయింది. తొలి మూడు రోజులు భారీ వసూళ్లు నమోదు చేసినా ఆ తర్వాత డీలా పడిపోయింది. ఇక బాలీవుడ్ అయితే ఈ సినిమా డిజాస్టర్‌గా మిగిలిపోయింది. పూర్తి ప్రేమకథ చిత్రమైనప్పటికీ ఒక్క యాక్షన్ ఎలిమెంట్ కూడా లేకపోవడం సినిమాకు పెద్ద మైనస్‌గా మారిపోయింది. ప్రభాస్, పూజా హెగ్డే వంటి స్టార్స్ ఉన్నా అనుకున్న రిజల్ట్ మాత్రం? రాలేదు. తాజాగా ఈ సినిమా ఫలితం గురించి పూజాహెగ్డే ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. కొన్ని సినిమాలు మనకు యావరేజ్ అనిపించినా బాక్సాఫీస్ వద్ద దుమ్మురేపుతాయి. మరికొన్ని మనకు బాగా నచ్చినా రిజల్ట్ అనుకున్నట్లు ఉండకపోవచ్చు. ఏ సినిమా ఎలాంటి ఫలితాన్ని ఇస్తుందనేది ముందుగానే రాసి పెట్టి ఉంటుంది. అలాగే జరుగుతుంది. రాధేశ్యామ్ విషయంలో కూడా అదే జరిగింది. బాక్సీఫీస్ వద్ద సినిమా తలరాత మారిపోతుంది అని బలంగా నమ్ముతాను అంటూ చెప్పుకొచ్చింది.



లెజెండరీ హీరో మెగాస్టార్ చిరంజీవి హీరోగా మెగా తనయుడు మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ మరో కీలక పాత్రలో నటించిన లేటెస్ట్ భారీ సినిమా “ఆచార్య” కోసం అందరికీ తెలిసిందే. దర్శకుడు కొరటాల శివ తెరకెక్కించిన ఈ సినిమా రిలీజ్ కి మరికొన్ని రోజులు మాత్రమే బ్యాలన్స్ ఉండగా మేకర్స్ రిలీజ్ పనుల్లో ఉన్నారు. మరి ఇదిలా ఉండగా ఈ సినిమాపై ఒక క్రేజీ బజ్ వినిపిస్తుంది. ఈ సినిమాకి గాను మన టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు తన వాయిస్ ఓవర్ ని అందిస్తున్నట్టుగా ఇప్పుడు తెలుస్తుంది. ఇది వరకే మహేష్ బాబు పలు సినిమాలకి వాయిస్ ఓవర్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇక ఈ సినిమాకి తాను కథను ఎలా ముందుకు నడిపిస్తారో చూడాలి. ఇక దీనిపై అధికారిక క్లారిటీ ఇంకా రావాల్సి ఉంది. మరి ఈ సినిమాలో కాజల్ మరియు పూజా హెగ్డే లు హీరోయిన్స్ గా నటించగా మణిశర్మ సంగీతం అందించారు. అలాగే మ్యాట్నీ ఎంటర్టైన్మెంట్స్ వారు నిర్మాణం వహించిన సంగతి తెలిసిందే.

## “ఆచార్య” కి సూపర్ స్టార్ మహేష్ వాయిస్ ఓవర్.?



నందమూరి బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన హ్యాట్రిక్ చిత్రం అఖండ. ఈ చిత్రం థియేటర్ల లో విడుదల అయ్యి భారీ బ్లాక్ బస్టర్ విజయాన్ని సాధించడం జరిగింది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను రాబట్టడం మాత్రమే కాకుండా, 100 రోజుల వేడుక ను కూడా జరుపుకుంది. ఈ చిత్రం ఇటీవల స్టార్ మా లో వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ గా బుల్లితెర ప్రేక్షకులను, అభిమానులను అలరించిన సంగతి అందరికీ తెలిసిందే. తాజాగా ఈ చిత్రం కి సంబంధించిన టీఆర్పీ రేటింగ్ రావడం జరిగింది. ఈ చిత్రానికి 13.3 డీసెంట్ టీఆర్పీ రావడం జరిగింది. ఈ చిత్రం లో ప్రగ్యా జైస్వాల్ హీరోయిన్ గా, జగపతి బాబు మరియు శ్రీకాంత్ లు కీలక పాత్రల్లో నటించారు. మ్యూజికల్ సెన్సేషన్ థమన్ ఈ చిత్రానికి సంగీతం అందించడం విశేషం.

## డీసెంట్ టీఆర్పీ రాబట్టిన బాలయ్య “అఖండ”



Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **GPR PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
TITLE CODE.TELTEL02057, Cell:8464816456 Email: aksharavelugudaily@gmail.com, Website: www.aksharavelugu.com